# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 62, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం -20 - మే - 2025


## వర్ష బీభత్సం.. నీట మునిగిన బెంగళూరు

ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం




ఈ ఏడాది బెంగళూరులో ఇదే అత్యధిక వర్షపాతం అంటున్న నగర వాసులు

సిల్క్ బోర్డ్ జంక్షన్, హెచ్ఆర్‌బీఆర్ లేఅవుట్, బొమ్మనహళ్లిలను ముంచెత్తిన వర్షం

## సీఎం సొంత గ్రామం

## కొండారెడ్డిపల్లిలో ప్రత్యేక పూజలు.. హాజరైన మంత్రులు



హైదరాబాద్: నల్లమల్ల పర్యటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ముఖ్యమంత్రికి అర్చకులు మిగతా..2లో

## మే 8న అమృత్‌సర్‌పై పాక్ దాడి

## : స్వర్ణ దేవాలయాన్ని కాపాడిన భారత వాయు రక్షణ వ్యవస్థ

మే 8న అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంపై పాక్ దాడికి యత్నం

భారత దాడులకు ప్రతీకారంగానే పాక్ చర్య అని ఆర్మీ వెల్లడి



ముందుగానే ఊహించి స్వర్ణ దేవాలయానికి అదనపు భద్రత

ఆకాశ్, ఎల్-70 గన్లతో పాక్ కుట్రను భగ్నం చేసిన సైన్యం

### 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం...

# భారత్ ఏమైనా ధర్మసత్రమా?

## శ్రీలంక వ్యక్తికి సుప్రీంకోర్టు ఘాటు ప్రశ్న

శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు


భారత్ ప్రపంచ శరణార్థులకు ధర్మశాల కాదని స్పష్టం

140 కోట్ల జనాభాతో మేమే సతమతమవుతున్నామన్న జస్టిస్ దత్తా

ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకేనని ఉద్ఘాటన



న్యూఢిల్లీ : "ప్రపంచంలోని శరణార్థులందరికీ ఆశ్రయం కల్పించడానికి భారతదేశం ఏమీ ధర్మసత్రం కాదు. ఇప్పటికే 140 కోట్ల జనాభాతో మేం ఇబ్బందులు పడుతున్నాం. విదేశీ పౌరులందరినీ మిగతా..2లో







## ఏపీలో వారందరికీ ఉచితంగా రక్తమార్పిడి

అమరావతి : ' రాష్ట్రంలో 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారు.. 2100 మంది తలసీమియాతో... ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు.. బాధితుల్ని గుర్తించి వారికి క్రమం తప్పకుండా ఉచితంగా రక్తమార్పిడి చేస్తున్నాం ' అని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ వెల్లడించారు. విజయవాడలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త సంబంధిత (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫిలియా) రుగ్మతలపై జరిగిన రాష్ట్రస్థాయి సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ముందస్తు రోగ నిర్ధారణ, సంరక్షణ ప్రణాళికలు, మిగతా..2లో

## విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా...

# హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

## కార్పొరేటర్లు తగినంత సంఖ్యలో హాజరు కాకపోవడమే దీనికి కారణం

డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయింపు

ఎన్నికకు పూర్తి స్థాయిలో హాజరు కాని టీడీపీ కార్పొరేటర్లు...!

చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దన్న లోకేశ్

ఎన్నిక నిర్వహణకు కనీసం 56 మంది సభ్యుల కోరం అవసరం కాగా, ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడింది



అమరావతి : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ ఎన్నిక అనూ హ్యంగా వాయిదా పడటం అధికార తెలుగు దేశం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేటర్లు తగినంత సంఖ్యలో హాజరు కాకపోవడమే దీనికి కారణం. ఈ పరిణామంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న జరగాల్సిన జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు మొత్తం 74 మంది సభ్యులకు గాను కేవలం 54 మందే హాజరయ్యారు. మిగతా..2లో

### శుభవార్త.. మోదీ చేతులమీదుగా

# తెలంగాణలో మూడు రైల్వేస్టేషన్లు ప్రారంభం..




కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్ లను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే, ఇదే క్రమంలో తెలంగాణా రాష్ట్రంలోనూ రైల్వే స్టేషన్ లను అభివృద్ధి చేస్తుంది. ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 22న తెలంగాణా రాష్ట్రంలోని మూడు రైల్వే స్టేషన్లు పునః ప్రారంభం కానున్నాయి.

తెలంగాణా మూడు రైల్వే స్టేషన్ల పునః ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్

దేశ వ్యాప్తంగా మొత్తం 102 స్టేషన్లు పునః ప్రారంభం కానుండగా, అందులో మూడు తెలంగాణా రాష్ట్ర రైల్వే స్టేషన్లు ఉన్నాయి. బేగంపేట, వరంగల్, కరీంనగర్ మిగతా..2లో

# కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి

'ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం'.. మంత్రి దుర్గేష్ కీలక వ్యాఖ్యలు

"ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్" డీఎస్సీ ట్రై మెథడ్స్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు.

మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో ఎస్జీటీ అభ్యర్థులకు మేలు చేసేలా మెటీరియల్ రూపొందించారు

కూటమి సర్కార్ తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగానికి పునర్వైభవం



అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఇవాళ(సోమవారం) వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్ లో తన ఛాంబర్‌లో మంత్రి కందుల దుర్గేష్ తన చేతుల మీదుగా ఎంతో మందిని టీచర్లుగా తీర్చిదిద్దిన "ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్" వారి డీఎస్సీ ట్రై మెథడ్స్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిగతా..2లో



### అందాల పోటీలకు రూ. 300 కోట్లు... పుష్కరాలకు రూ. 35 కోట్లేనా?

- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానం ఆచరించిన బండి సంజయ్
- పుష్కరాల ఏర్పాట్లకు రూ.35 కోట్లు చాలా తక్కువని విమర్శ

### నల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి మాట్లాడుతుంటే..

# నా గుండె ఉప్పొంగుతోంది : రేవంత్

- ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ చిరస్థాయిగా నిలిచిపోయింది
- నల్లమల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రణాళిక
- రూ.12,600 కోట్లతో గిరిజన సంక్షేమ పనులు
- నల్లమల రైతులకు ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు
- పోడు భూములను సాగులోకి తెచ్చేందుకు చర్యలు
- అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- పహల్గామ్ ఘటన అనంతరం దేశవ్యాప్తంగా అదే చర్చ జరిగింది: రేవంత్ రెడ్డి





హైదరాబాద్ : పహల్గామ్ ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ దేశవ్యాప్తంగా జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసిన ఘనతను గుర్తు చేశారు. 50 ఏళ్లు గడిచినా ఇందిరాగాంధీ పేరును ప్రజలు తలుచు కుంటు న్నారంటే మిగతా..2లో

సభా వేదిక నుంచి నల్లమల్ల డిక్లరేషన్‌ను, మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ డిక్లరేషన్‌తో ఆదివాసీలు, బంజారాలు, చెంచులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుంది. గిరిజన సంక్షేమానికి రూ.12,600 కోట్లు పనులు చేపట్టనున్నారు. నల్లమల్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని, గతంలో పోడు భూములు పోరు భూములుగా మారాయని, ఇప్పుడు వాటిని వ్యవసాయ యోగ్యంగా మారుస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు




## మరోసారి కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు పొడిగింపు

### రాజీవ్ యువ వికాసంపై

## బిగ్ అప్డేట్, జూన్ 2న రూ.1000 కోట్లు విడుదల



హైదరాబాద్: వజ్రం లాంటి సీఎం, వజ్రాల్లాంటి మంత్రులు హృదయాల నుంచి వచ్చిన అద్భుతమైన పథకం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జూన్ 2న గిరిజన యువతకు 'రాజీవ్ యువ వికాసం' స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.1000 కోట్లు మంజూరు చేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసంపై బిగ్ అప్డేట్, జూన్ 2న రూ.1000 కోట్లు విడుదల మిగతా..2లో

### నీళ్లు లేని ఫైరింజన్లు, మాస్కులు లేని సిబ్బంది: గుల్జార్‌హౌస్

## అగ్ని ప్రమాదంపై కేటీఆర్ వ్యాఖ్యలు

- చార్మినార్ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన కేటీఆర్
- అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ భద్రతపై లేదని విమర్శ

హైదరాబాద్ : గుల్జార్ హౌస్ లో అగ్నిప్రమాదం సంభవించిన ప్రదేశానికి ఫైరింజన్లు చేరుకున్నా వాటిలో నీళ్లు లేకపోవడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలపై చూపిస్తున్న శ్రద్ధను మిగతా..2లో



# వర్ష బీభత్సం.. నీట మునిగిన బెంగళూరు

న్యూఢిల్లీ : టెక్ నగరం బెంగళూరులో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం ముంచెత్తింది. దాదాపు ఆరు గంటలకుపైగా ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షానికి నగరం మొత్తం నీట మునిగింది. లోతట్టు ప్రాంతాలు జలాశయాలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది బెంగళూరులో ఇదే అత్యధిక వర్షపాతంగా నగర వాసులు చెబుతున్నారు. నగరంలో వర్షం సృష్టించిన బీభత్సానికి సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేస్తున్నారు. ప్రసిద్ధ సిల్క్ బోర్డ్ జంక్షన్, హెచ్ఆర్‌బీఆర్ లేఅవుట్, బొమ్మనహళ్లిలను వర్షం ముంచెత్తింది. మరోవైపు బెంగళూరులో గురువారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాగా, నిన్న కెంగేరిలో అత్యధికంగా 132 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు కర్ణాటక రాష్ట్ర విపత్తు పర్యవేక్షణ విభాగం వెల్లడించింది. అలాగే బెంగళూరు ఉత్తర భాగంలోని వడేరహళ్లి 131.5 మిల్లీమీటర్ల వర్షపాతంతో రెండో స్థానంలో నిలిచింది. చాలా ప్రాంతాల్లో రాత్రిపూట 100 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

## 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం...

## భారత్ ఏమైనా ధర్మసత్రమా?: శ్రీలంక వ్యక్తికి సుప్రీంకోర్టు ఘాటు ప్రశ్న

మొదటి పేజి తరువాయి

చేర్చుకోవడానికి ఇది ధర్మశాల కాదు," అంటూ సుప్రీంకోర్టు ఓ శ్రీలంక జాతీయుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనకు ఆశ్రయం కల్పించాలంటూ సదరు వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది. ఈ దేశంలో స్థిర నివాసం కల్పించాలనే హక్కు మీకెక్కడిదని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ దిపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీలంకలో ఒకప్పుడు క్రియాశీలంగా ఉన్న లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో సదరు శ్రీలంక జాతీయుడిని భారత్ లో అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద 2018లో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్షాకాలం పూర్తయ్యాక దేశం విడిచి వెళ్లాలని, అప్పటివరకు శరణార్థుల శిబిరంలో ఉండాలని ఆదేశించింది. దీంతో, సదరు శ్రీలంక తమిళ జాతీయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తనకు ప్రాణహాని ఉందని, తన భార్యాపిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. శిక్ష పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తనను ఇంకా నిర్బంధంలోనే ఉంచారని, దేశం నుంచి పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదని వాపోయాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు - వాక్ స్వాతంత్ర్యం, సంచార స్వేచ్ఛ వంటివి) కింద తమకు హక్కులున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పిటిషనర్ వాదనలపై జస్టిస్ దత్తా తీవ్రంగా స్పందించారు. "భారత్ ధర్మసత్రం కాదు" అని వ్యాఖ్యానించారు. పిటిషనర్‌ను చట్ట ప్రకారమే నిర్బంధంలోకి తీసుకున్నారని, కాబట్టి ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయని తేల్చిచెప్పారు. "ఇక్కడ స్థిరపడటానికి మీకేం హక్కు ఉంది?" అని కోర్టు సూటిగా ప్రశ్నించింది. తాను శరణార్థినని, శ్రీలంకలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే విన్నవించినప్పటికీ, ధర్మాసనం అంగీకరించలేదు. "భారతదేశం మీ కోసం ఎదురుచూడటం లేదు. మీరు కోరుకుంటే మరో దేశానికి వెళ్లవచ్చు" అని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. చట్టప్రకారం నిర్దేశించిన ప్రక్రియ పూర్తయిన తర్వాత పిటిషనర్‌ను శ్రీలంకకు పంపించాలని అధికారులను ఆదేశించింది.

## మే 8న అమృత్‌సర్‌పై పాక్ దాడి

## : స్వర్ణ దేవాలయాన్ని కాపాడిన భారత వాయు రక్షణ వ్యవస్థ

న్యూఢిల్లీ : మే 8న పంజాబ్‌లోని అమృత్‌సర్‌పై పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడికి తెగబడింది. ఈ దాడిలో ప్రధాన లక్ష్యం పవిత్ర స్వర్ణ దేవాలయం కాగా, భారత వాయు రక్షణ దళాలు అత్యంత సమర్థవంతంగా ఈ కుట్రను భగ్నం చేసి ఆలయానికి రక్షణ కల్పించాయి. తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే పాకిస్థాన్ ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. భారత సైన్యంలోని 15వ ఇన్ఫాంట్రీ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) మేజర్ జనరల్ కార్తీక్ సి శేషాద్రి సోమవారం ఈ వివరాలను వెల్లడించారు. స్వర్ణ దేవాలయం లక్ష్యంగా వచ్చిన అన్ని డ్రోన్లు, క్షిపణులను ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్లు విజయవంతంగా కూల్చివేశారని ఆయన తెలిపారు. "పాకిస్థాన్ సైన్యానికి చట్టబద్ధమైన లక్ష్యాలు ఏవీ లేవని మాకు తెలుసు. అందుకే వారు భారత సైనిక స్థావరాలు, మతపరమైన ప్రదేశాలతో సహా పౌర లక్ష్యాలపై దాడి చేస్తారని ముందే ఊహించాం. వీటిలో స్వర్ణ దేవాలయం అత్యంత ప్రధానమైనదిగా గుర్తించి, ఆలయానికి సంపూర్ణ వాయు రక్షణ కల్పించేందుకు ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను అదనంగా మోహరించాం" అని మేజర్ జనరల్ వివరించారు. మే 8న పాకిస్థాన్ మానవరహిత వైమానిక ఆయుధాలు, ప్రధానంగా డ్రోన్లు మరియు సుదూర శ్రేణి క్షిపణులతో భారీ వైమానిక దాడికి పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. "దీనిని ముందే ఊహించి మేము పూర్తి సన్నద్ధతతో ఉన్నాము. మా ధైర్యవంతులైన, అప్రమత్తమైన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్లు పాకిస్థాన్ సైన్యం యొక్క దుష్ట పన్నాగాన్ని అడ్డుకుని, స్వర్ణ దేవాలయంపైకి వచ్చిన అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు. తద్వారా మా పవిత్ర స్వర్ణ దేవాలయానికి చిన్న గీత కూడా పడకుండా కాపాడాము" అని ఆయన వివరించారు. పాకిస్థానీ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌తో పాటు ఇతర నగరాలను ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్‌లతో సహా భారతీయ వాయు రక్షణ వ్యవస్థలు ఎలా కాపాడాయో సోమవారం సైన్యం ఒక ప్రదర్శన ద్వారా వివరించింది.

## రాజీవ్ యువ వికాసంపై

## బిగ్ అప్డేట్, జూన్ 2న రూ.1000 కోట్లు విడుదల


మొదటి పేజి తరువాయి

'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జల వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని అన్నారు. 20 ఏళ్ల అధికారం అచ్చంపేట నియోజకవర్గంలో 'ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం' ప్రారంభ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలని అన్నారు. నల్లమల డిక్లరేషన్ అమలుచేసి గిరిజనులకు ఫలితాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గిరిజనులు పంట పండించుకుంచే మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టారని, ఎంతో మందిపై పోలీసు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క ఆరోపించారు. వజ్రం లాంటి సీఎం, మంత్రులు "దేశంలోనే గొప్ప కార్యక్రమం "ఇందిర సౌర గిరి జల వికాసం పథకం". జల్, జంగల్, జమీన్, భూమి కోసం, భుక్తి కోసం పోరాటం వంటి నినాదాలను చట్టంగా మారుస్తున్న ఈ ప్రభుత్వంలో భాగం అవ్వడం వల్ల నా జన్మ ధన్యమైంది. వజ్రం లాంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వజ్రాల లాంటి మంత్రుల హృదయ అంతరాల్లోంచి ఈ పథకం ఉద్భవించింది" - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభివృద్ధి ఫలితాలు ప్రజలకు అందకుండా, ప్రభుత్వంపై నిత్యం కుట్రలు చేస్తున్నారని భట్టి ఆరోపించారు. ప్రభుత్వంపై ఒక మాట అన్న, కుట్ర చేసిన అది రాష్ట్ర ప్రజలపై కుట్రగానే భావిస్తామన్నారు. జూన్ 2న రూ.1000 కోట్లు జూన్ 2న గిరిజన యువతకు 'రాజీవ్ యువ వికాసం' స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.1000 కోట్లు మంజూరు చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. నల్లమల సాక్షిగా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మొత్తం కేబినెట్... నల్లమల్ల సాక్షిగా మాట ఇస్తున్నామన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఉమ్మడి కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించబోతున్నామని చెప్పారు.

## నీళ్లు లేని ఫైరింజన్లు, మాస్కులు లేని సిబ్బంది

## : గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదంపై కేటీఆర్ వ్యాఖ్యలు


మొదటి పేజి తరువాయి



అగ్ని ప్రమాదాల నివారణపై కూడా చూపాలని సూచించారు. ఇలాంటి దుర్ఘటనల్లో ఇంకో ప్రాణం పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్ లో జరిగిన ఘోర అగ్నిప్రమాద స్థలాన్ని కేటీఆర్ సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "రాజకీయాలు చేయడానికి నేను ఇక్కడికి రాలేదు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలను కాపాడటంపై ప్రధానంగా దృష్టి సారించాలి" అని స్పష్టం చేశారు. కేవలం ఐదు లక్షల రూపాయల పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం సరికాదని, ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తక్షణమే రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రే హోం శాఖను కూడా పర్యవేక్షిస్తున్నందున, ఆయన స్వయంగా ఇలాంటి ఘటనా స్థలాలకు వస్తే అధికారులు మరింత బాధ్యతాయుతంగా, చురుగ్గా పనిచేయడానికి ఆస్కారం ఉంటుంది" అని కేటీఆర్ సూచించారు. వేసవి కాలం ప్రారంభం కావడానికి ముందే అగ్నిమాపక శాఖ అధికారులతో ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించి, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని ఆయన కోరారు. "అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, వాటిలో నీళ్లు లేవని తెలిసింది. అలాగే, సిబ్బందికి సరైన రక్షణ మాస్కులు కూడా అందుబాటులో లేకపోవడం విచారకరం. ప్రమాద స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ కూడా లేకపోవడం అత్యంత దురదృష్టకరం" అంటూ కేటీఆర్ ప్రభుత్వ లోపాలను ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర చరిత్ర లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదమని పేర్కొన్న కేటీఆర్, "నిన్నటి రోజు అత్యంత దుర్భరమైనది. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణించడానికి కూడా మాటలు రావడం లేదు" అని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి మాట్లాడుతుంటే.. నా గుండె ఉప్పొంగుతోంది : రేవంత్

మొదటి పేజి తరువాయి



ఆమె పాలన ఎంత గొప్పదో అర్థమవుతుందన్నారు. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ చిర స్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. నల్లమల ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై 'నల్లమల డిక్లరేషన్'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఒకప్పుడు వెనుకబాటుకు నిలయంగా ఉన్న నల్లమల ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడటం గర్వకారణంగా ఉందని, తన గుండె ఉప్పొంగిపోతోందని ఆయన అన్నారు. తాను పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని సగర్వంగా చెప్పునల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి ఇక్కడ నిలబడి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగుతోందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, పార్టీ నేతలు సహా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికి ఆదర్శంగా నిలిచే.. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని.. ఆ దిశగా అధికారులకు సూచనలు చేశానని చెప్పారు. సభా వేదిక నుంచి నల్లమల్ల డిక్లరేషన్‌ను, మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ డిక్లరేషన్‌తో ఆదివాసీలు, బంజారాలు, చెంచులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుంది. గిరిజన సంక్షేమానికి రూ.12,600 కోట్లు పనులు చేపట్టనున్నారు. నల్లమల్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని, గతంలో పోడు భూములు పోరు భూములుగా మారాయని, ఇప్పుడు వాటిని వ్యవసాయ యోగ్యంగా మారుస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. పోడు భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిది అంటూ ఎద్దేవా చేశారు. పోడు భూముల్లో సోలార్ పంపుసెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిది అని కొనియాడారు. ప్రస్తుతం వ్యవసాయంలో ఉపయోగిస్తున్న కరెంట్ పంప్ సెట్ల స్థానంలో 100 రోజుల వ్యవధిలో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా.. ప్రభుత్వమే నూటికి నూరు శాతం ఖర్చును భరిస్తుందని చెప్పారు. రైతులకు 5 హెచ్‌పీ , 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల సోలార్ పంప్ సెట్లు ఉచితంగా అందిస్తామన్నారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించిన తరువాత మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం సేకరించి.. ఆ విలువను మహిళా రైతుల ఖాతాల్లో ప్రతి నెల జమ చేస్తుందని వివరించారు. ఈ విధంగా ప్రతి రైతు నెలకు రూ. 3 వేల నుంచి 5 వేల వరకు అదనంగా సంపాదించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 60 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసిందని గుర్తు చేశారు. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని రేవంత్ తెలిపారు. వరి వేస్తే ఉరే అనే పరిస్థితుల నుంచి వరి వేస్తే సిరి అనే పరిస్థితులు కల్పించామని స్పష్టం చేశారు. పేదలందరికీ సన్న బియ్యం అందించి వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది పేదలకు సన్న బియ్యం.. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు సీఎం. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని.. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించామని వివరించారు. అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వెల్లడించారు. పాలమూరోల్లకు పాలన చేతకాదన్న వాళ్లకు.. తెలంగాణను నెంబర్ వన్ గా నిలబెట్టగలమని నిరూపించామన్నారు. ఎంతోమంది ప్రధానులు అయినా.... ప్రతీ తండాలో.. పేదవాడి గుండెల్లో నిలిచిపోయింది మాత్రం ఇందిరమ్మ మాత్రమేనని కొనియాడారు. మరోవైపు 'ఇందిర సౌర గిరి జల వికాసం' పేరు పలకటానికి కష్టంగా ఉందని.. పథకం పేరును "ఇందిర సోలార్ గిరి జల వికాసం"గా మార్చాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను విజ్ఞప్తి చేశారు. సౌర అనే బదులు సోలార్ అని పెడితే మా వాళ్లకు అల్కక అర్థమైతది అంటూ సీఎం రేవంత్ చెప్పారు.

## అందాల పోటీలకు రూ. 300 కోట్లు...

## పుష్కరాలకు రూ. 35 కోట్లేనా?

మొదటి పేజి తరువాయి

పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంత పెద్ద పుష్కర పండుగకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 35 కోట్లు మాత్రమే విడుదల చేయడం ఏర్పాట్లకు ఏమాత్రం సరిపోదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు వస్తే, అక్కడి బీజేపీ ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి ఘనంగా నిర్వహించిందని బండి సంజయ్ గుర్తుచేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే, పుష్కరాలను కుంభమేళా తరహాలో కోట్లాది మంది భక్తులను తరలించి ఎంతో వైభవంగా నిర్వహించేవాళ్లమని ఆయన వ్యాఖ్యానించారు. "అందాల పోటీలకు రూ. 300 కోట్లు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూ.35 కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు. పుష్కరాలను కేవలం ఈ ప్రాంతానికే పరిమితం చేయడం సరైన పద్ధతి కాదని, వచ్చే పుష్కరాలకైనా ఎక్కువ బడ్జెట్ కేటాయించి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడంతో ఈ ప్రాంతానికి చెడ్డపేరు వచ్చిందని, కనీసం ఈ పుష్కరాల ద్వారానైనా మంచి పేరు రావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ అకాడమీ పాఠ్య పుస్తకాల ఆధారంగా, ప్రస్తుత సిలబస్ ప్రకారం గణితం, విజ్ఞాన, సాంఘిక శాస్త్రం ట్రై మెథడ్స్ మెటీరియల్‌ను రూపొందించిన విషయ నిపుణులు బాలరాజును మంత్రి దుర్గేష్ అభినందించారు. దీంతో పాటు 1500 కు పైగా బిట్స్ కలిగిన బుక్ లెట్ సైతం ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల్లో స్వీయ లోపాలు సవరించుకునే ప్రాక్టీస్ బిట్స్‌తో పాటు గత పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నాపత్రాలతో ఉన్న మెటీరియల్ అభ్యర్థులకు ఉపకరిస్తుందని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం 16 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో ఎస్జీటీ అభ్యర్థులకు మేలు చేసేలా మెటీరియల్ రూపొందించారని ప్రశంసించారు. రాష్ట్ర విద్యార్థులకు రాయితీ పై మెటీరియల్ అందించాలని, అదే విధంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. సమాజాభివృద్ధిలో విద్యారంగానిది కీలకపాత్ర అని మంత్రి దుర్గేష్ అన్నారు. కూటమి సర్కార్ తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగానికి పునర్వైభవం వచ్చిందన్నారు. ఏపీలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా...

## హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

ఎన్నిక నిర్వహణకు కనీసం 56 మంది సభ్యుల కోరం అవసరం కాగా, ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడింది. దీంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ, పలువురు గైర్హాజరు కావడం గమనార్హం. ఈ పరిణామాలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఈ ఎన్నికకు గైర్హాజరైన కార్పొరేటర్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. కొందరిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... జీవీఎంసీలో తమకు కావాల్సినంత సంఖ్యాబలం ఉందని తెలిపారు. "డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. గత రాత్రి 11 గంటలకు ఆ పదవిని జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించాం" అని పల్లా తెలిపారు. టీడీపీలో కూడా ఆ పదవిని ఆశించేవారు ఉన్నారని ఆయన గుర్తుచేశారు. ఎన్నిక వాయిదా పడటానికి సమన్వయ లోపం కూడా ఒక కారణమని, అందుకే ఈ ఇబ్బంది తలెత్తిందని ఆయన అంగీకరించారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా హాజరవుతారని, దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జరగనున్న ఎన్నికకు సభ్యులందరూ హాజరై, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసేలా చూడాలని పార్టీ శ్రేణులకు అధిష్ఠానం నుంచి గట్టి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం విశాఖ రాజకీయాల్లో కొంత అలజడి సృష్టించింది.

## ఏపీలో వారందరికీ ఉచితంగా రక్తమార్పిడి

మొదటి పేజి తరువాయి






రక్త వ్యాధుల సమగ్ర నిర్వహణ కోసం విధానాల రూపకల్పనపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమం రక్త సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచడానికి ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. బాధితులకు స్క్రీనింగ్, చికిత్స అందించడానికి ప్రభు త్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని ను అగ్రస్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష అని తెలిపారు. జన్యుపరంగా వారసత్వంగా వస్తున్న వ్యాధి ఇది.. వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం అన్నారు. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నామని వెల్లడించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తుంద ని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, 10 లక్షల 50 వేల మందికి స్క్రీనింగ్ చేశారని వెల్లడించారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారు.. 2100 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని తెలిపారు. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నాం అన్నారు. నోడలాఫిసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు

## శుభవార్త.. మోదీ చేతులమీదుగా

## తెలంగాణలో మూడు రైల్వేస్టేషన్లు ప్రారంభం..

మొదటి పేజి తరువాయి

రైల్వే స్టేషన్ లను ప్రధాని మోదీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఇక ప్రధాని చేతుల మీదుగా పునః ప్రారంభం కానున్న రైల్వే స్టేషన్ల వివరాలలోకి వెళితే 26.55 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునికంగా బేగంపేట రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి చేశారు. 26.55 కోట్ల రూపాయల వ్యయంతో పునరాభివృద్ధి చేశారు. కొత్త స్టేషన్ భవనం,12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫామ్ షెల్టర్, లిఫ్టులు/ఎస్కలేటర్లు, కొత్త వెయిటింగ్ హాల్, కొత్త టాయిలెట్లు ఇలా ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులను కల్పించారు.

### ఎయిర్పోర్ట్ తరహాలో సర్వాంగ సుందరంగా వరంగల్ రైల్వే స్టేషన్

అత్యాధునిక వసతులతో బేగంపేట రైల్వే స్టేషన్ ను ఒక ఎయిర్పోర్ట్ తరహాలో అభివృద్ధి చేశారు. ఇదే సమయంలో 25.41 కోట్ల నిధులచే అధునాతన వరంగల్ రైల్వే స్టేషన్ భవనం పునః ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్పోర్ట్ తరహాలో అత్యాధునిక వసతులతో వరంగల్ రైల్వే స్టేషన్ లో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు , లిఫ్టులు, ర్యాంపులు, ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక ఆహారశాలలు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు.

### పునః ప్రారంభానికి రెడీ అయిన కరీంనగర్ రైల్వే స్టేషన్

అదేవిధంగా మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ కార్పోరేట్ తరహాలో ఏసీ వెయిటింగ్ హాల్స్ నిర్మించారు. రైల్వే స్టేషన్ మొత్తం సీసీటీవీ పరిధిలో ఉంచడంతోపాటు పచ్చదనం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నెల 22 తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్ పద్దతిలో ఆదునీకరించిన కరీంనగర్ రైల్వేస్టేషన్ ను ప్రారంబించనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ క్రింద 2023 ఆగష్టు లో పీఎం నరేంద్ర మోదీ ప్రారంభించారు.

### 30 కోట్ల రూపాయలతో కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

అప్పటి నుండి ఇప్పటివరకు వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగాయి. 30 కోట్ల రూపాయలతో స్టేషన్ అభివృద్ధి లో భాగంగా అప్రోచ్ రోడ్,6 బుకింగ్ కౌంటింగ్ సెంటర్,వికాలంగులకు ప్రత్యేక బుకింగ్ కౌంటర్, 12 మీటర్ వెడల్పైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెండు ఎస్కలేటర్లు, స్టేషన్ ముందు పార్క్, వెయిటింగ్ హాల్, అన్ని రకాల సైన్ గుర్తులు ఏర్పాటు చేసారు. తెలంగాణ లోని మూడు రైల్వేస్టేషన్ లు 22 న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇంకా 37 స్టేషన్ లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

## సీఎం సొంత గ్రామం


## కొండారెడ్డిపల్లిలో ప్రత్యేక పూజలు.. హాజరైన మంత్రులు


మొదటి పేజి తరువాయి

పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం, రైతులు సుభిక్షంగా ఉండాలని భగవంతుని ప్రార్ధించినట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ మంత్రి శ్రీధర్ బాబు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిరుద్ రెడ్డి, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకాటి శ్రీహరి, బాలు నాయక్ రామ్మోహన్రెడ్డి, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి కాళేశ్వరం

## కమిషన్ విచారణ గడువు పొడిగింపు





హైదరాబాద్: తెలంగాణ సర్కార్ మరోసారి కాళేశ్వరం కమి షన్ విచారణ గడువును పొడి గిం చింది. ఈనెల 31వ తేదీతో కమి సన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో దానిని జూలై 31వ తేదీ వరకూ పొడిగిస్తూ

తాజాగా నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల్లో అవకతవకలపై ఉమ్మడి ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించింది. తొలుత ఈనెల (మే నెల)లోనే తుది రిపోర్ట్ ఇస్తామని కమిషన్ లీక్ ఇచ్చినప్పటికీ.. జూలై 31వ తేదీ వరకూ పొడిగించడంతో విచారణపై ఉత్కంఠ నెలకొంది. ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తారనే చర్చ నడుస్తోంది.

## కృష్ణా జిల్లా మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్
# (ఎంఈఎఫ్) నూతన జిల్లా కమిటీ ఏర్పాటు





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : .18/05/2025 ఆదివారం సాయంత్రం 7గంటలకు మచిలీపట్నం ఈశ్వర్ రెసిడెన్సీ హాల్ నందు కృష్ణా జిల్లా మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నూతన జిల్లా కమిటీ ఏర్పాటు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు స్టేట్ ప్రెసిడెంట్ దేవరపల్లి బిక్షాలు మాదిగ అద్వర్యంలో జరిగినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) కృష్ణ జిల్లా నూతన కమిటీ లో ప్రెసిడెంట్ గా దేవరపల్లి విక్టర్ బాబు, గన్నవరంనుండి హాజరైనారు,వైస్ ప్రెసిడెంట్ గా జుజ్జువరపు అనిల్ కుమార్, జనరల్ సెక్రటరి గా బీడెల్లి మరియ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ గా బొకినాల కృష్ణ, ట్రెజరర్ గా రాచపూడి బాలస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉడుముల దుర్గారావు, గన్నవరం నుండి హాజరైనారు) గౌరవ అధ్యక్షులు గా మేదర రమేష్, గౌరవ ముఖ్య సలహాదారు గా రావెల వరుణ్ కుమార్, లీగల్ అడ్వైజర్ గా అద్దేపల్లి నిరంజన్ వారలను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో గంద్రపు శీనయ్య మాస్టర్, ఏసుబాబు దేవరపల్లి, రాబర్ట్ జాన్సన్ దేవరపల్లి, పి.నవీన్ (గన్నవరం నుండి హాజరైనరు) ధనరాజు.డి, ,ఎం. ప్రభకరావు పెనమలూరు,ఎం. ప్రవీణ్, ఎం. జయప్రకాష్, ఎం ఆనంద్, జె. గణేష్, వి. సురేష్, ఎం. అశోక్, టి. ఈసాక్ పాల్, కె. జోనాథన్, పి.సురేష్, బి. శివరామకృష్ణ, కె శాంతి బాబు, కె. చంద్ర శేఖర్, కె. సుధీర్ చిట్టి బాబు, సిహెచ్ నిరంజనరావు, సిహెచ్రాజ్ కుమార్ ఇంక మొదలై న వారు పాల్గొన్నారు.

# ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు





రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొందరు ఆలయ భూముల్లోని మట్టినీ వదలడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్కడబడితే అక్కడ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా లారీలకొద్ది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనంగా మండలంలోని మిట్టగుడిపాడు వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన సర్వే నెంబర్ 168 లో గుర్తుతెలియని వ్యక్తులు జెసీబీ తో మట్టి తవ్వకాలు జరిపి అక్రమ సంపాదనకు తెరలేపారు. దాదాపు 25 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు మేర విస్తీర్ణంలో తవ్వకాలు జరిపి మట్టి తరలించకుపోయారు. లోతైన గుంతలు తవ్వి నాణ్యమైన మొరం మట్టిని తీసి అమ్ముకుంటూ అక్రమార్కులు డబ్బులు దండుకుంటున్నారు. నాణ్యమైన మొరం మట్టికి మార్కెట్లో మంచి గిరాకీ ఉండడంతో ఇదే అదునుగా భావించి అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆలయ భూముల్లో మట్టిని మాయం చేస్తున్నారు. ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు జరుపుతుండడం పై దేవాదాయ శాఖ అప్రమత్తమైంది. సోమవారం ఈవో గాదె రామిరెడ్డి ఈ విషయమై స్థానిక తహసీల్దార్ దృష్టికి తెచ్చి తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్లోనూ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు.

## ఓటిఎస్ విధానం
# అమలు చేస్తే తప్ప - అప్పుల నుండి బయట పడలేం
### పోలవరం ఎమ్మెల్యేకి విన్నవించిన రైతులు



జీలుగుమిల్లి, (శుభోదయం న్యూస్): ప్రభుత్వం సహకార సంఘాల్లో ఓటిఎస్ విధానాన్ని అమలు చేస్తే అప్పుల నుండి బయట పడలేమని, మరణించిన వారి అప్పులను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ పోలవరం నియోజకవర్గంలోని సుమారు 250 మంది రైతులు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ గోడును ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తీసుకున్న అప్పులకు మించి రెండు మూడు రెట్లు అధికంగా వడ్డీల రూపంలో సొసైటీలకు చెల్లించమని అన్నారు. ఒకపక్క వడ్డీలు కడుతున్న అసలు రుణాలు తీర్చుకోలేక, మరో ప్రక్క కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యేకి తెలిపారు. జాతీయ బ్యాంకులన్ని ఓటీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాయని, ఇదే విధానాన్ని సహకార సంఘాలు కూడా అమలు చేస్తే తామంతా రుణ విముక్తుల మౌతామని తెలిపారు. సొసైటీలకు అప్పుగా ఉన్న చాలామంది రైతులు మృతి చెందారని, ఇలా లా మృతి చెందిన వారి అప్పులు కూడా ప్రభుత్వం రద్దు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ రైతులంతా తన దృష్టి తీసుకొచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అంతేకాకుండా సొసైటీలపై వస్తున్న ఆరోపణలపై సమీక్ష నిర్వహించి, రైతులపై ఒత్తిడి లేకుండా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. అప్పులు చెల్లించలేని రైతుల గురించి గ్రామాల్లో ప్రచారం చేయడం బాధాకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, రైతులు యాంద్ర రాజేంద్ర, గన్నిన సూర్యచంద్రరావు, రాయి సుబ్బారావు, తూంపాటి దుర్గారావు, పూసం చుక్కమ్మ, తుష్టి నాగు, వసుమర్తి భీమేశ్వరరావు, పైదా వెంకటేశ్వరరావు రైతులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆక్యుప్రెషర్
## ఆక్యూపంక్చర్ గుర్తింపుకు కృషి ఎమ్మెల్యే బోడె ప్రసాద్



(శుభోదయం న్యూస్) ఎన్టీఆర్ జిల్లా: నా నియోజకవర్గంలో నిర్వహించబడుతున్న ఆక్యుప్రెషర్ ఆక్యూపంక్చర్ వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వ గుర్తింపు కొరకు మాజీ లోక్ సభ సభ్యుడు కొనకళ్ళ నారాయణతో కలిసి కృషి చేసినట్లు తెలిపారు.10 సంవత్సరాల కాలం పట్టిన వెన్నంటి ఉండి,నిర్విరామంగా మా సహకారం పొంది కేంద్ర ప్రభుత్వ గుర్తింపుకు ఈ ప్రాంతంలో వైద్య వృద్ధి చెందటానికి పనిచేసిన మాకాల సత్యనారాయణ ను అభినందిస్తున్నాను అని తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాలలో భాగంగా మోడీ ఫిట్నెస్ మంత్ర అవగాహన బ్రోచర్ను ఆవిష్కరించి,తన సహకారం అందిస్తానని తెలిపారు.యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ పెనమలూరు ఎమ్మెల్యే బోడు బోడే ప్రసాద్ , మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ ,అమలాపురం మాజీ ఎంపీ పండుల రవీంద్ర బాబు అందించిన సహకారమే ఈనాడు కేంద్ర ప్రభుత్వం ఆక్యూపంక్చర్ ను ప్రత్యేక విభాగ చికిత్సగా గుర్తింపు రావడానికి కారణమని అలా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే 20 25 అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయటానికి సహకారం అందిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# గుత్తి వారి నిశ్చితార్థ వేడుకల్లో బైరెడ్డి, దారపనేని



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణ అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్, బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజ, శ్రీమతి బుజ్జమ్మ దంపతుల కుమార్తె దివ్య, నెల్లూరు జిల్లా వింజమూరు వాస్తవ్యులు జలగం వెంకటరత్నం, శ్రీమతి దొరసాని దంపతుల కుమారుడు చిరంజీవి వెంకట నరేంద్ర ల నిశ్చితార్థం వేడుకలు నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, దేవస్థానం నిర్మాణ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ దంపతులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ళ నారాయణరెడ్డి పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. గుత్తి అనిల్ ,లక్ష్మీ యశస్విని దంపతులు, తిరుమల శెట్టి అశోక్, కల్పన దంపతులు,కనిగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఊస మధుసూదన్ రావు, నరసింగు సాంబశివరావు, బండ్ల నారాయణ, దరిశి రాము, సుబ్రహ్మణ్యం, ఓగూరి నరసింహారావు, గుత్తి వారి కుటుంబ సభ్యులు, జలగం వారి కుటుంబ సభ్యులు, పామూరు పట్టణంలోని ప్రముఖ జ్యువెలరీ షాప్ యజమానులు, తదితరులు భారీ సంఖ్యలో నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## మండల వైస్ ప్రెసిడెంట్ పదవి ఏకగ్రీవంగా చేపట్టిన పాడి కండ్ల కృష్ణ



త్రిపురాంతకం, మే 19 శుభోదయం విలేఖరి చిన్న మూర్తయ్య: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలు నందు ఎర్రగొండపాలెం నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్ ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ బలపరిచిన మేడిపి ఎంపీటీసీ పాడిపండ్ల కృష్ణను సోమవారం ఆయనకు బీఫారం అందించి ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సమావేశంలో ఎంపీడీవో జి రాజ్ కుమార్ మాజీ ఎంపీపీ వాళ్ళ ఆంజనేయ రెడ్డి పలువురు ఎంపీటీసీలు సర్పంచులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు ఈ సమావేశానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బోయల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో
# వైసిపి నుండి టిడిపిలోకి చేరిక



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): మండలంలోని డిజీపేట గ్రామానికి చెందిన బిసి యువ నాయకులు చీపు శ్రీను వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం కనిగిరిలో మినీ మహానాడు సందర్భంగా జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోయల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరిని కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితునై పార్టీలో చేరినట్టు పార్టీలో క్రమశిక్షణతో మెలిగి పార్టీ కోసం పని చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ తోట రవి కుమార్, వరికుటి హనుమంతరావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహానాడు పాల్గొన్న కూటమి నాయకులు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ కనిగిరి పట్టణంలోని మూలే బాలిరెడ్డి ఫంక్షన్ హాల్ లో మినీ మహానాడు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం కి ఆరు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు కె ఎస్ ఎస్ సబ్మిట్ చేసిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కున సుబ్బారెడ్డి తదుపరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాజా రహమతుల్లా, వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు, ఫత్తు మస్తాన్, మాజీ సర్పంచ్ సోమిశెట్టి నారాయణ, మాజీ సర్పంచ్ డివి మనోహర్,బూత్ ఇన్చార్జ్ ఖాదర్, ఫిషర్ మెన్ రంతుల్లా, గుత్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి



దోర్నాల మండలం రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి ,,,,సిపిఐ దోర్నాల దోర్నాల మండలం అయినముక్కుల రెవిన్యూ తిమ్మాపురం ప్రభుత్వ భూములను స్థానిక పేదలకు పంపిణి చెయ్యాలని గత కొన్ని సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకత్వంలో పోరాటం చేయుచున్న విషయము అందరికీ తెలిసిన విషయమే వందలాది ప్రభుత్వ భూములను స్థానిక ఇతరులైన కర్నూలు కడప గుంటూరు కృష్ణ గోదావరి జిల్లాలకు, ఇతర పరుగు రాష్ట్రాలైన తెలంగాణ కు చెందిన అనేకమంది దోపిడి దొంగలు అక్రమ ఆన్లైన్ చేయించుకుని అనేక రూపాల్లో వేల కోట్ల డబ్బులు దండుకుంటూ స్థానిక పేదలకు చెందాల్సిన ప్రభుత్వం భూములను అన్యాక్రాంతం చేయుచున్నారని వాటిని పేదలకు ఇవ్వాలని సిపిఐ పోరాడుతున్న క్రమంలో భాగంగా నేడు ఫ్రీ ఓల్డ్ ముసుగులో వందలాది ఎకరాల ప్రభుత్వం భూములు చేతులు మారుతున్న ప్రభుత్వాలు , ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా ఉన్నాయి, స్థానిక భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని, అక్రమార్కుల చరలో నుండి విడిపించి స్థానిక పేదలకు కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున ఇవ్వాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుంది, అక్రమార్కుల చరలో ఉన్న ప్రభుత్వ భూములను బంజర భూములను చెరువు కుంట,ఆయకట్ట భూములను సమగ్ర విచారణ జరిపించి స్వాధీన పరుచుకుని వాటిని భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని సిపిఐ పార్టీ విజ్ఞప్తి చేయుచున్నది, ఫేక్ డాక్యుమెంట్లతో ఫ్రీ ఓల్డ్ ప్రభుత్వ అసైన్మెంట్ భూములను అమ్మకాలకు పాల్పడిన భూ దొంగలపై రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరిగింది. అదే కోవకు చెందిన ఇంకా అనేకమంది భూ కబ్జాదారులు దోపిడిదారులు ఉన్నారు వారి పైన కూడా తగు చర్యలు తీసుకొని ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్థానిక పేదలకు భూములు పంపిణీ చేయాలని సిపిఐ విజ్ఞప్తి చేయుచున్నది, ఈ భూములు పేదలకు దక్కేంతవరకు ఎర్రజెండా వారి వెంట ఉండి పోరాడుతుందని సిపిఐ ఐదవ మండల మహాసభ సందర్భంగా తీర్మానం చేయడం జరిగింది, శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు 2000 వేల కోట్లు తక్షణమే విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తి చేయాలని ఈ సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది, ఇంటి స్థలము లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఐదు లక్షలతో ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగింది,మండల, జిల్లా సమితి సభ్యులు బాణాల రామయ్య, పూర్ణ కంటి తిరుమలయ్య, మండల కార్యదర్శి విశ్వరుపాచారి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు

## రాచూరి పెద్దమ్మ తల్లి తిరుణాల సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్





పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు సర్కిల్ పరిధిలోని సిఎస్ పురం పట్టణంలో ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 5 వరకు వైభవంగా జరుగు రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా పట్టణంలోని వివిధ సామాజిక వర్గాల నాయకులతో, ఆలయ కమిటీ సభ్యులతో, గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమైన పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్ గారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల వేడుకల్లో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా సంతోషకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ పురం సబ్ ఇన్స్పెక్టర్ సుమన్, గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఆకుపాటి..



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): హెచ్ఎంపాడు మండల పరిధిలోని శ్రీ శ్రీ నాగ పరివార సమేత పోలేరమ్మ తల్లి తిరుణాల సందర్భంగా పామూరు పట్టణ ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ ఈ తల్లి దగ్గర అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందకరంగా ఉందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ముక్కులు తీర్చుకున్నారు ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు మరియు లక్ష్మణ్, సాయి, మరియు తదితరులు పాల్గొన్నారు.



## మినీ మహానాడుకు హాజరైన అంచూరి వెంకట రెడ్డి



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): మీనీ మహానాడు కనిగిరి పట్నం నందు మూలే బాలిరెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమానికి గోపాలపురం గ్రామానికి చెందిన అంచూరి వెంకటరెడ్డి తన అనుచరులతో మహానాడుకు హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పలు సమస్యల గురించి శాసనసభ్యులు వారికి తెలియజేయడమైనది ఈ కార్యక్రమంలో పార్టీ ఎద్దుల శివ, ఓగురు నరసింహ రావు, చిన్న హజ్రత్, మిత్ర బృందం మరియు తెలుగుదేశం జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోళ్ల వ్యర్థపదార్థలు
## చేపల చెరువులకు తరలింపుప్రజల ఆరోగ్యంతో పని లేదు






గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : మా ఆఫీస్ కి ఒక్కొక్కరు ముడుపులు అందిచవలసిందే సుమారు నగర పరిధిలో రోజుకు 20 ట్రాలీ బొలెరో వాహన లలో చేపల చెరువులు కు తొలకం ఫుడ్ సేఫ్ వారు సేఫ్ ముడుపులతో దుర్వాసన తట్టుకోలేకపోతున్న నగర ప్రజలు మాకు అవన్నీ అవసరం లేదు మాకు కావాల్సింది ప్రతినెల వేళల్లో అందించండి ఎన్ని బొలెరో వాహనాలలో నైనా తరలించు కొండి ఒక్కొక్క దానికి ప్రతి నెల ముడుపుల రుసుం కట్టాల్సిందే మాకు వ్యర్థాల దుర్ వాసన రాదు జేబులు బరువుగా ఉంటే చాలు ఫుడ్ సేఫ్టీ గన్నవరం నుంచి గుడివాడ చేపల చెరువులకు వయా ఆటోనగర్ అడ్డా గా తరలింపు అంతా చంద్ర మయం అని వాపోతున్న స్థానిక ప్రజానీకం.

## తొట్టంబేడు నూతన మండల అధ్యక్షుడుగా మునిరాజ నాయుడు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): తొట్టంబేడు మండల నూతన తెలుగుదేశం పార్టీ నూతన మండలాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా రావిల్ల.మునిరాజనాయుడు ని ఎన్నుకున్నారు.ఆయనను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడు పదవికి ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి తగిన ప్రాధాన్యత ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు అనంతరం సుదీర్ఘంగా తెలుగుదేశం పార్టీకి అభివృద్ధికి కృషిచేసి చేసిన గాలి.మురళి నాయుడు ని కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు.టిడిపి పూడి గ్రామ ఇన్చార్జి శేషమ నాయుడు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కమిటీకి ఎమ్మెల్యే బొజ్జల అభినందనలు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యావర్గాన్ని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన స్వగృహానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.జర్నలిస్టుల సంక్షేమం, భద్రత విషయంలో రాజీ పడనని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కందేరి కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షులు వై. చంద్రయ్య, పిఆర్ఓ ఈశ్వర్ పరిటాలను ఎమ్మెల్యే ఆత్మీయంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను నూతన కార్యవర్గం శాలువా, పూలమాలతో సత్కరించింది.



## ఉదయ్ శేఖర్ కుటుంబాన్ని
## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు




శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : పట్టణంలోని నాయుడు బిల్డింగ్స్ గోపాలవనం నందు కాకర్ల ఉదయ్ శేఖర్ చౌదరి ఇటీవలే కాలంలో అనారోగ్యంతో మరణించినారు.వారి సతీమణి నీ శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ అంజూరు.శ్రీనివాసులు పరామర్శించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు మున్నా రాయల్,నియోజకవర్గం యువజన అధ్యక్షులు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, వేలూరు రమేష్ సంతాపం తెలిపారు.

## ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు
## నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన...
### మంత్రి నాదెండ్ల, పోలవరం ఎమ్మెల్యే చిర్రి



(శుభోదయం న్యూస్), జీలుగుమిల్లి: ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కరాటం సాయి పాల్గొన్నారు. నూతన క్యాంపు కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మొదటిగా మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి



పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తు న్నందుకు అలాగే ప్రజలకు మరింత చేరువలో ఉండేందుకు కార్యాలయం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో మరింత చేరువగా ఉంటూ ఆదరణ పొందుతు ముందుకు సాగాలని చిర్రి బాలరాజు కోరారు.

## సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం
## -సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి




వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన పుచ్చలపల్లి సుందరయ్యజీవితాంతం పేదలు వ్యవసాయ కూలీల,కార్మికుల, పేద ప్రజల కోసం పనిచేసిన గొప్ప మహనీయుడని ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామిఅన్నారు.సోమవారం మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజలు వ్యవసాయ కూలీలు,కార్మికుల,దళితుల కోసం తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు,ఉత్తమ పార్లమెంట్ సభ్యునిగా సైకిల్ పై వెళ్లి రాజకీయాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడన్నారు పిల్లలు పుడితే తనలో స్వార్థంపెరుగుతుందనే భావనతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని తన జీవితం మొత్తం పేదల కోసం పనిచేసిన త్యాగమూర్తన్నారు స్వాతంత్ర ఉద్యమ సమయంలో బాల్య దశలోనే పోరాటాలకు ఉత్తేజితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి దక్షిణ భారతదేశంలో సిపిఎం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని సిపిఎం మొదటి జాతీయ కార్యదర్శిగా పనిచేశారని ఎంపీ,ఎమ్మెల్యేగా పార్లమెంటు,అసెంబ్లీలో చట్టసభలకు వన్నెతెచ్చిన రాజకీయ సిద్ధాంతకర్త అన్నారు, ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమైందని ఆయన చూపిన దోపిడీ,పీడనలేని సమ సమాజం కోసం,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళని,ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, పట్టణ శాఖ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కొండూరు సత్తయ్య,శీలం ఇందిర, మాడుగుల వెంకటేశం,మైసొల్ల నరేందర్, శోభ,తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ మార్కులు సాధించిన
## విద్యార్థుల ను సన్మానిస్తున్న మున్నూరుకాపు పెద్దలు.



బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం కిష్టాపూర్ గ్రామంలో మున్నూరు కాపు బిడ్డలు అయినా 10 వ తరగతి మరియు ఇంటర్ పసైన ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల కు సన్మానం చేయడం జరిగింది. 10వ తరగతి లో కొట్టే విగ్నేశ్వర్ 556 మార్కులు, కొట్టే గంగా ప్రసాద్ 494, ఎంగాయి అరుణ్ 47,1 ఇంటర్ లో ఎంగాయి అనూష్ణ 968, అమ్ముల మైత్రి 965 మార్కులు సాధించారు వారికీ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో బీర్కూర్ మండల మున్నూరుకాపు కమిటీ అధ్యక్షులు మేకల విట్టల్ సార్ ఉపాధ్యక్షులు పుల్లేని బాబు రావు కార్యదర్శి ఎంగాయి సత్యం గ్రామ అధ్యక్షులు కర్కా శంకర్ ప్రధాన కార్యదర్శి అయినాల సాయిలు ఉపాధ్యక్షులు కొట్టే రాజు కల్లా నారాయణ కోశాధికారి ఎంగాయి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు కర్ణం శ్రీనివాస్ ఉపాధ్యక్షులు కొట్టే వెంకటి సభ్యులు బాన్స్ వాడ సాయిలు పుల్లేని పీరయ్య పుల్యారి రవీందర్ లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం
## లబ్దిదారులకు వెంటనే ఆర్థిక సహాయం అందించాలి
### చుంచు రాజేందర్, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు




శుభోదయం న్యూస్ హనుమకొండ: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు సాకుతో నిలిపివేసిన ఉపాధి హామీ జాబ్ కార్డు ల జారీ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని జాబ్ కార్డు ల జారీ ని నిరంతరం కొనసాగించి చట్టం స్ఫూర్తి ని కొనసాగించాలని,పనుల వద్ద కూలీలైన హక్కుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పతకం లబ్దిదారులకు అర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వై గణేష్ కి పలు డిమాడ్ లతో కూడిన వినతిపత్రాన్ని డిబిఎఫ్ ఆద్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరౌసా పథకం అమలు పేరుతో ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా జాబ్ కార్డులలో పేర్ల నమోదు, నూతన జాబ్ కార్డుల జారిని నిలిపివేశారని, జాబ్ కార్డుల జారిని నిలిపివేయడమంటే ఉపాధి హామీ చట్టాన్ని అడుగడుగున ఉల్లంఘన లకు పాల్పడటమే అవుతుందని అన్నారు.కనుక జాబ్ కార్డు లలో పేర్ల నమోదు, నూతన జాబ్ కార్డు ల జారీ నిరంతర పక్రియగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదే విధంగా చట్టానికి విరుద్ధంగా తొలగించిన జాబ్ కార్డుల ను తిరిగి యాక్టివ్ గా మార్చాలని, పని ప్రదేశంలో కనీస వసతులైన నీరు,నీడ,మెడికల్ కిట్స్ లను అందుబాటులో వుంచాలన్నారు.రద్దు చేసిన వేసవి అలవెన్స్ ను తిరిగి చెల్లించాలని,పనిముట్లైన పార,గడ్డపార,గంపలు,టెంట్ లు,మెడికల్ కిట్స్ పథకం ప్రారంభ దశలో పంపిణి చెసినవే తప్ప కొత్తగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.కూలీలకు పనిముట్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఇందిరమ్మ అత్మీయ భరోస పథకం లబ్దిదారులకు ఆర్థిక సహయాన్ని వెంటనే అందించాలని, ఉపాధి హామీ పర్యవేక్షణలో పౌర ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ లను లో తిరిగి భాగస్వామ్యం చేయాలని జిల్లా డిఆర్వో కి వినతిపత్రం ఇస్తూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షులు కొమ్ముల కరుణాకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు రాజు,కృష్ణ, కిరణ్,సదానందం తదితరులు పాల్గొన్నారు.

## మీట్ యు చికెన్ సెంటర్ ను
## ప్రారంభించిన ఆదం విజయ్ కుమార్







మేడ్చల్ మల్కాజ్గిరి, జిల్లా రిపోర్టర్ - జీ నరహరి (శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ తార్నాక డివిజన్ కిమ్తీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మీట్ యు చికెన్ సెంటర్ ను సికింద్రాబాద్ నియోజకవర్గం సీనియర్ రాజకీయ నాయకుడు ఆదం విజయ్ కుమార్ ప్రారంభించారు. చికెన్ సెంటర్ నిర్వాహకుడు షాప్ ఓనర్ అయిన రాజు మాట్లాడుతూ మీట్ యు యాప్ ద్వారా ఐదు కిలోమీటర్ల లోపల ఉన్న కస్టమర్స్ మా యాప్ ద్వారా చికెన్ బుక్ చేసుకున్న వాళ్ళకి ఫ్రీ హెూం డెలివరీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం సతీష్ నరహరి శోభన్ బాబు రాజు శేఖర్ శ్రీను సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన.....
### కన్నాయిగూడెం మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య





మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్): కన్నాయిగూడెం ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు మావూరి వెంకటయ్య కుతురువివాహం బుట్టాయిగూడెం లో జరగగా ఈ వేడుకకి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరిన కన్నాయిగూడెం బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య వెంట బి ఆర్ఎస్ పార్టీ మండల ఉపఅధ్యక్షులు చిలుముల రాంబాబు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కావిరి చిన్నికృష్ణ కుమ్మరి నర్సింహా రావు కుమ్మరి నాగార్జున్ కావిరి బక్కయ్య యువజన నాయకులు కావిరి నర్సింహా రావు కావిరి మహేష్ దుర్గం రాజుకుమార్ కన్నాయిగూడెం మండల బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా కావిరి అంజన్ రావు జనగాం రవీందర్ బుట్టాయిగూడెం గ్రామ యూత్ అధ్యక్షులు జాడి రాజాబాబు ఉపఅధ్యక్షులు కావిరి నాగమల్లయ్య తదితరులు ఉన్నారు.

## ప్రమాద వశత్తు కరెంటు షాక్ కు గురై గేదె మృతి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ): లింగంపేట్ మండలం లోని భవానిపేట్ గ్రామ వాసి పిన్నురి లక్ష్మణ్ గేదె ఆదివారం మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో, గ్రామ శివార్లో వెతుకగా నిన్న కుర్శినా భారీ వర్షానికి సర్వీస్ వైర్ తెగి కింద పడిపోవడం జరిగింది. ప్రమాద వశత్తు సర్వీస్ వైర్ కు అంటుకొని,పిన్నురి లక్ష్మణ్ తండ్రి హనుమయ్య గేదె (బర్రె ) సోమవారం చనిపోవడం జరిగిందని పిన్నురి లక్ష్మణ్ తెలిపారు. అయన వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్మెన్ పాండు, ఏ ఎల్ ఎం రాజు లు వచ్చి విద్యుత్ నిలిపివేసి సర్వీస్ వైరుకు తొలిగించి చనిపోయిన గేదెను పరిశీలించడం జరిగిందని పిన్నురి లక్ష్మణ్ తెలిపారు. అయన మాట్లాడుతూ గేదె వయసు సుమారుగా ఏడు సంవత్సరాలు ఉంటుందని, గేదె విలువ 70000 వేలు ఉంటుందని యజమాని లక్ష్మణ్ తెలిపారు.కావున విద్యుత్ అధికారులు స్పందించి తగిన న్యాయం చేయగలరని యజమాని లాక్ష్మణ్ కోరారు.

## కొండాపూర్, కంచుమల్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నియామక పత్రాలు అందజేత



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయంన్యూస్): లింగంపేట్ మండలంలోని కొండాపూర్. కంచుమల్ గ్రామాలలలో ఇందిరమ్మ ఇళ్ల మంజురు పాత్రలూ %ఽ% భూమి పూజ చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా లింగంపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రామకృష్ణ గౌడ్, గ్రామ సెక్రటరీ, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు కమ్మరి సిద్దు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కాశీరాం, బెస్త సాయిలు, సంగా గౌడ్, రవి,అంజి, సురేష్ గౌడ్,శివ, గంగ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సభ్యులు, నాయకులు పాల్కొన్నారు.

## జై కిసాన్ ట్రేడర్స్, ఫెర్టిలైజర్స్ సీడ్స్ షాప్ ప్రారంభోత్సవం





వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గాంధీ విగ్రహం పక్కన నూతనంగా జై కిసాన్ ట్రేడర్స్,ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్,సీడ్స్ షాపును సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా షాప్ యజమానులు మాట్లాడుతూ మన వెలువర్తి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా జై కిసాన్ ట్రేడర్స్, ఫెర్టిలైజర్స్ షాపును ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామంలోని చుట్టుపక్కల రైతు సోదరులకు కావాల్సిన అన్ని రకముల ఎరువులు,విత్తనాలు మరియు పురుగు మందులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని,ఈ అవకాశాన్ని ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు లక్ష్మణ్,జానీ,మాజీ ఎంపీటీసీ లు ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య, గుండు శేఖర్,రైతులు దొడ్డు రమేష్,కల్లూరి చంద్రయ్య,ఉక్కుర్తి స్వామి,వెంకటయ్య గౌడ్,ఆగ్రోఎంప్లాయ్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరంగా యాత్రకు ఎంపీ ఈటల రాజేందర్ రాక



వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):నేడు భువనగిరిలో నిర్వహించే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత సైనికులకు గౌరవ వందన సూచకంగా తిరంగా యాత్ర చేస్తున్నారు.ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున ఇట్టి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర జిల్లా సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పిలుపునిచ్చారు.

## నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు రహీమ్ షరీఫ్



సంస్థాన్ నారాయణపురం మే 19 (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ఓనర్ జనగాం గ్రామానికి చెందిన బొంగు నవీన్ గౌడ్ నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ను ప్రారంభించడం జరిగింది.డైరీ పార్లర్ ను కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండి రహీం షరీఫ్ సందర్శించి హెరిటేజ్ లస్సీ కొనుగోలు చేయడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ లో లభించే పాలు, పెరుగు,లస్సీ మొదలైన పానీయాలు మంచి రుచితో పాటు నాన్యతమైనవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ కాలేక్,బొంగు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఆర్.బి.రాములను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అక్బర్ అలీ



సంస్థాన్ నారాయణపురం మే 19 (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సమస్తాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఆర్ బి రాములును ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అక్బర్ అలీ అనంతరం మాట్లాడుతూ కష్టపడి చదువుకుంటేనే చదువుతోపాటు సంస్కారం విలువలు అభివృద్ధి చెందుతారని అన్నారు చదువుకు కులాలు మతాలు అడ్డుకావు ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నత స్థాయి శిఖరాలకు ఎదగాలని కోరారు మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వాలు అనేక రంగాలలో కృషి చేస్తుంది ప్రభుత్వం గుర్తించి వారికి ప్రోత్సాహంతో ముందుకు తీసుకెళ్లి వారి జీవితాలలో వెలుగు నివ్వాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది అనంతరం నూతనంగా సేద తీర్చుకోవడం కోసం ఏర్పాటుచేసిన బెంచీల దాతగా నిలిచారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఏపూరి సతీష్, రాస మల్ల యాదయ్య, అంతటి స్వామి, రాచకొండ రమేష్, పెద్దగోని విష్ణు, వలిగొండ మాధవులు, రిపోర్టర్ సింగం కృష్ణ,పెద్దగోని బిక్షం,మల్లయ్య, తాయారు,తదితరులు పాల్గొన్నారు.

## తబితా ఆశ్రమ అమ్మాయి ఘనంగా పెళ్లి కూతురు చేసిన స్వచ్ఛందా సంస్థల నిర్వహకులు. ఆశ్రమంలో మద్దెల దినేష్ జన్మదిన వేడుకలు



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) రామగుండం తనతా ఆశ్రమ అమ్మాయికీ ఆడంబరంగా పెళ్లి సంబరాలు సోమవారం రోజున స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పెళ్లి కుమార్తె ను చేసే కార్యక్రమ వేడుకలో తబితా ఆశ్రమం లో మానస పెళ్లి 21 కలెక్టర్ సమక్షంలో జరుగుతుండగా ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ శ్రీ సీతారామ సేవా సమితిల నేతృత్వంలో మానసను ఘనంగా పెళ్లి కూతురు నీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్జి వన్ జీఎం లలిత్ కుమార్ గారి సతీమణి అనిత లలిత్ కుమార్ హాజరై ఆశ్రమానికి మా సహాయ సహకారాలు ఉంటుందని పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. తబిత ఆశ్రమానికి మా వంతు సహాయ సహకారాలు ఎప్పటికి ఉంటాయి అన్నారు.అనంతరం పిల్లల మధ్య ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అద్యక్షులు మద్దెల దినేష్ పుట్టిన




రోజు సందర్భంగా సింగరేణి సేవ సమితి అద్యక్షరాలు శ్రీమతి అనిత లలిత్ కుమార్ గారీ చేతులు మీదుగా శ్రీ సీతారామ సేవా సమితి, జయహెూ మహిళా అధ్యర్యంలో కెక్ కటింగ్ అలాగే శాలువా తో చిరు సత్కారం చేయడం జరిగిందన్నారు.అనంతరం మద్దెల దినేష్ ఆధ్వర్యంలో పిల్లలకు మరియు ఆశ్రమానికి విచ్చేసిన అధికారులకు అతిథులకు అన్నదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోలివాడ చంద్రకళ, కంది సుజాత, జక్కెన శ్రీ లత, బిల్లా శ్రీదేవి, కొండు రమాదేవి, బట్టల గీత, మద్దెల రామస్వామి పద్మ, వై. లేనీన్, దసారపు రాజేంద్ర ప్రసాద్, బాదే వెంకటేష్, మల్లికార్జున్, తబితా ఆశ్రమం నిర్వాహకులు విరెంద్ర నాయక్, విమల మరియు హెల్పింగ్ హాండ్స్ శ్యామ్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలిని కలెక్టర్ కి వినతి



యాదాద్రి భువనగిరి జిల్లా మే 19 (శుభోదయం న్యూస్): రాష్ట్రంలో రేషన్ డీలర్లుకి పలు సమస్యలను పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు జాయింట్ కలెక్టర్ వీరారెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎలగల రాజయ్య ఆధ్వర్యంలో సోమవారం రోజు కలిసి వినతిపత్రం సమర్పించారు జిల్లాలో 314 రేషన్ షాపుల్లో ఫిబ్రవరి మాసం సంబంధించిన దొడ్డు బియ్యం నిలువలను రేషన్ షాప్ లో నుంచి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతున్న తరుణంలో గత నాలుగు నెలలుగా నిలువ ఉన్న దొడ్డు బియ్యం కు పురుగు పట్టి సన్న బియ్యం కు పురుగు ఏర్పడే ప్రమాదం ఉందని. దాంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది అలాగే దాంతోపాటు పాకిస్తాన్ యుద్ధ సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలు ఇబ్బంది పడద్దని కేంద్ర ప్రభుత్వం జూన్ జూలై ఆగస్టు మాసాలలో మూడు నెలల రేషన్ పంపిణీ చేయాలని నిర్ణయించడం మూడు నెలలకు సరిపడా స్టాకు రేషన్ దుకాణంలో పట్టకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు విన్నవించారు అలాగే జిల్లాలో ప్రతి ఐ ఎం జి పాయింట్లు రేషన్ డీలర్లకు తూకం కంట వేసి బియ్యం ఏర్పాటు చేయాలని విన్నవించారు ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలార్ల సంఘ కోశాధికారి ఉమా దర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గీసుకొండ సంజీవరావు భువనగిరి వలిగొండ పోచంపల్లి బీబీనగర్ తుర్కపల్లి రాజపేట ఆలేరు మోటకొండూర్ గుండాల ఆత్మకూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా డీలర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో విద్యార్థులు పతకాలు కనబరిచారు. విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించారు.

-రాష్ట్రస్థాయి పోటీలలో న్యూ షావోలివ్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులకు పతకాలను సాధించారు. పట్టణ ములోని సి.ఆర్ క్లబ్ నందు నడుపబడుతున్న న్యూషావోలిన్ కుంగ్ ఫు అకాడమీ గత 9 సవత్సరాలగా ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు మార్షల్స్ ఆర్ట్స్ నందు ఉచితముగా శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఊషు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయకేతవం ఎగురవేసి జాతీయస్థాయి పోటీలకు చేరుకున్న అడాడమీ విద్యార్థులు. ఈ నెల 12,13,14వ కర్నూలు జిల్లాలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో న్యూ షావోలెన్ కుంగూ ఫు అకాడమీ విద్యార్థులు సబ్ జూనియర్, జూనియర్, సినియర్ విభాగాలలో 18 మంది. విద్యార్థులు పాల్గొని తమ.. తమ విభాగలలో అబ్బురపరచే ప్రదర్శన చేసి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. వారిలో జాతీయస్థాయికి అర్హత సాధించిన విద్యార్థులు సబ్ జూనియర్ విభాగంలో గ్రంధి గగవ్, జూనియర్ విభాగంతో బత్తుల అభిషిక్ట్, సినియర్ విభాగాలలో బత్తుల విక్రమ్, పాలపాటి నాగరాజు, షేక్ రబ్బాని పాల్గొనబోవుచున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభకార్యక్రమం సోమవారం స్థానిక సి.ఆర్ క్లబ్ జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూ షావోలిన్ కుంగూ ఫు అకాడమీ గౌరవ అధ్యక్షులు మద్దుల వెంకట కోటయ్య,టి. బెనర్జీ, సి.ఆర్ క్లబ్ పెద్దలు పాల్గొని విజేతలైన విద్యార్థులకు పతకాలు అందజేసి వారివి అభినందిచారు. జాతీయస్థాయిలో గెలుపు సాధించాలని శుభాకాంక్షలు చెలియజేశారు. గౌరవ అధ్యక్షులు మద్దుల వెంకట కోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యంతో రాష్ట్రస్థాయిలో పతకాలు పొందిన విద్యార్థులను అందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చీఫ్ యస్.కె.దరియా వలి, మాస్టర్ యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొర్రపాటి రాంబాబు, కుర్చేటి బ్రహ్మయ్య, కాకి ప్రసాద్, ఇన్స్ట్రక్టర్స్ యస్.కె.రబ్బాని, యం.దుర్గా ప్రసాద్, కె.రాహుల్, బ్లాక్ బెల్టర్స్ సాకేత్, సుధీర్, ఖమృద్దీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ

### ఎఫ్ సి ఆర్ ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ సేవ్ ఆర్డిటి జేఏసి

నార్పల మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ దగ్గర నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీలో మండల పరిధిలోని గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఈ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగినదిఆర్డిటి సంస్థ గ్రామాలలో పిల్లల చదువులకు మరియు ఆరోగ్యమునకు ఇల్లు బడి వ్యవసాయము ప్రతి రంగాలలో కూడా పేద బడుగు బలహీన వర్గాల కుల మతం తేడా లేకుండా అభివృద్ధికి తోడ్పడి ప్రతి ఒక్కరికి సహాయం చేసింది ఆర్ డి టి సంస్థ అలాంటి సంస్థకి ఈరోజు ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయకపోవడం వలన ఆర్డిటి సంస్థకి గుండె ఆగిపోయినంత పని అయిపోయినది కావున.ఆర్డిటి సంస్థకి నిధులు రాకపోతే పేద ప్రజలు అభివృద్ధికి పూర్తిగా ఆగిపోతుందని ప్రజలు తిరుగుబాటు చేయాల్సిన అవసరం వచ్చింది అదేవిధంగా ఆర్డిటి సంస్థ ఇన్ని రోజులు మనల్ని కాపాడింది అయితే ఇప్పుడు మనం ఆర్డిటిని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరు ర్యాలీలో శాంతియుతంగా,పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ప్రతి ఒక్కరికీ పేరు పేరునా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానుఈ కార్యక్రమంలో సేవ్ ఆర్ డి టి జేఏసీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, సేవ్ ఆర్ డి టి జేఏసీ కన్వీనర్ దుర్గం రామాంజనేయులు, కో కన్వీనర్ రంగాపురం పుల్లప్ప, కమిటీ సభ్యులు శివయ్య, సుధాకర, గంగాధర, సూర్యనారాయణ, ఎర్రన్న, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్, ప్రభుదాస్, వెంకటేష్, తుంపెర శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే మా ధ్యేయం: సీఎం రేవంత్ రెడ్డి

:ఇందిర సౌర గిరి జల వికాసం పథకంలో భాగంగా రైతులకు సోలార్ పంప్ సెట్లు ఉచితంగా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.5.7.5 హెచ్ పి పంపుసెట్లు ఇస్తామన్నారు. అచ్చంపేటను మోడల్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి....నాగర్ కర్నూల్ పర్యటనలో భాగంగా ఇవాళ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అమ్రాబాద్ మండలంలోని మాచారం చేరుకున్నారు. ఈ మేరకు ఆయన ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ కూడా పాల్గొన్నారు. తెలంగాణలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు పోడు పట్టాలు మంజూరైన నేప థ్యంలో బీడు వారుతున్న పోడు భూములకు జలకళను తెచ్చేందుకే సర్కార్ ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ప్రవేశ పెట్టింది.రాబోయే ఐదేళ్లలో 2.10 లక్షల ఎకరాల పోడు భూముల్లో సాగుకు వంద శాతం సబ్సిడీతో సోలార్ పంప్ సెట్లను అందజేయను న్నారు. ఈ పథకాన్ని అమలు చేయడం ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా బలంగా చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా విద్యుత్ సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకం వర్తించనుంది...గిరిజన రైతుకు 2 ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే.. సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేయనున్నారు.ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభో త్సవం సందర్భంగా గిరిజన రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవ సాయం కోసం సౌర విద్యుత్ ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా అదనంగా వచ్చే సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్మాలని ఆయన సూచించారు. గిరిజన రైతులు ఒకే పంట మీద ఆధారపడొద్దని.. వివిధ రకాల పంటలను సాగు చేయాలన్నారు. అప్పుడే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సోలార్ పంపు సెట్ల ఏర్పాటులో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు పంపు సెట్లు ఇస్తామన్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఇన్నాళ్లు విద్యుత్ కనెక్షన్లు తీసుకునేందుకు విద్యుత్ శాఖతో గిరిజన రైతులకు తీవ్ర ఇబ్బందులు ఉండే వని.. ఇకనుంచి ఎవరికీ ఇటువంటి ఇబ్బందులు ఉండవు అన్నారు.

## ఇప్ప మంగమ్మకు గణితశాస్త్రంలో డాక్టరేట్

హసన్ పర్తి మండలం కోమటిపల్లి గ్రామంలోని పరిమళకాలనీకి చెందిన ఇప్ప మంగమ్మకు గణితశాస్త్రంలో డాక్టరేట్ పట్టా లభించింది .హైదరాబాద్ లోని అనురాగ్ యూనివర్సిటి డీన్ ప్రొఫెసర్ యం.ముత్తారెడ్డి హైదరాబాద్ లో మంగమ్మకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పిహెచ్డి డిగ్రీ ప్రధానం చేశారు.ఇప్ప మంగమ్మ మానవీయ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ వై.ధర్మేందర్ రెడ్డి పర్యవేక్షణలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ పరిశోధన శీర్షిక న్యూ మరికల్ సొన్యాషన్స్ ఆఫ్ ఎంహెచ్ డి హీట్ అండ్ మాస్ ట్రాన్ఫర్ నానో ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఎ ష్రింకింగ్,స్ట్రెచింగ్ సర్ఫేస్ ఇతివృత్తం ఆధారంగా చేయబడింది.ఇది ద్రవగతి శాస్త్రం,కంప్యూటేషన్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

హాసన్ పర్తి మండలం లోని గార్డెన్ లో హసనపర్తి మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు మేకల రాజన్న మాదిగ కూతురు అయినా చిరంజీవి సౌభాగ్యవతి నవ్య శ్రీనివాస్ పెళ్లి లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎం ఎస్ పి జాతీయ నేత దళిత రత్న అవార్డు గ్రహీత మంద కుమార్ మాదిగ, ఎం ఎస్ పి రాష్ట్ర నేతలు పుట్ట రవి మాదిగ, ఆరెపల్లి పవన్ మాదిగ, రాజారపు బిక్షపతి మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ ఎం ఎస్ పి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు,రేణుకుంట్ల దుర్గ ప్రసాద్ మాదిగ, దార సారయ్య ,మల్గారి ఆనందం మాదిగ, పుల్ల శోభన్ మాదిగ, రామంచ సంపత్ మాదిగ, అంబాల కుమార్ మాదిగ రామంచ మల్లేష్ మాదిగ, రామంచ ప్రభాకర్ జయగిరి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, బోడ సాంబయ్య మాదిగ తదితరులు

శుభోదయం


సంపాదకీయం

## ముక్కలు కానున్న పాకిస్థాన్!

## (విశ్లేషణ)

భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో బెంబేలెత్తిపోతున్న పాకిస్తాన్‌కు నైరుతి ప్రాంతంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బిఎల్ఎ) నుంచి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్వయంపాలన కోసం పోరాడుతున్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు అదను చూసి మరీ పాక్ సైన్యంపై దాడులను ఉధృతం చేస్తున్నారు. తాడోపేడో తేల్చుకోవడానికి ఇదే తగిన సమయమని భావించినవారు మరో అడుగు ముందుకువేసి తమ ప్రాంతాన్ని బలూచిస్థాన్ రిపబ్లిక్‌గా ప్రకటించుకున్నారు. పోరాటయోధుడు మిర్ యార్ బలూచ్ నేతృత్వంలో బలూచిస్థాన్ నేతలు ఈ నెల 9న పాకిస్తాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అంతేకాకుండా పాక్‌పై భారత్ చేస్తున్న దాడులకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటుగా ఆ పోరాటానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. మరో వైపు బలూచిస్థాన్ రిపబ్లిక్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, తమ దేశాల్లో బలూచిస్థాన్ దౌత్య కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని ఐక్యరాజ్యసమితితో పాటుగా అన్ని ప్రపంచ దేశాలకు వారు విజ్ఞప్తి చేశారు కూడా. చూడడానికి ఇది ఓ మామూలు ప్రకటనగా కనిపిస్తున్నప్పటికీ దీని ప్రభావం పాకిస్తాన్ సుస్థిరతపైనా, అలాగే దక్షిణాసియా భౌగోళిక పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే భౌగోళికంగా పాకిస్తాన్‌లో అతిపెద్ద ప్రావియన్స్ అయిన బలూచిస్థాన్ గత కొన్ని దశాబ్దాలుగా అశాంతికి నిలయంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం తమ వనరులను దోచుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఇక్కడి ప్రజలను నిరుపేదలుగా మారుస్తోందని స్థానికులు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. అందుకే తమకు స్వయం పాలనాధికారం కావాలంటూ అక్కడి వారు పోరాటం చేస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతంలో బలవంతపు కిడ్నాప్‌లు, చట్ట వ్యతిరేక హత్యలు లాంటివి ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో పెచ్చుమీరిపోయాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల నివేదికలు చెబుతున్నాయి. వీటన్నిటినీ భరించలేని తిరుగుబాటుదారులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరిట గత కొంత కాలంగా పాకిస్తాన్ సైన్యమే లక్ష్యంగా దాడులు కొనసాగిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా పెద్ద సంఖ్యలో పాక్ సైనికులను మట్టుబెడుతూ పాక్ ఫెడరల్ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. గత మార్చిలో క్వెట్టానుంచి పెషావర్‌కు 400 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును బిఎల్ఎ తిరుగుబాటుదారులు హైజాక్ చేయడం వారి ఉద్యమంలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. ప్రయాణికులను విడిపించడానికి పాక్ సైన్యం బ్రహ్మప్రయత్నమే చేయాల్సి వచ్చింది. పాక్ ప్రభుత్వం నిషేధిత ఉగ్రవాద సంస్థగా ముద్రవేసిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని బలూచీ గిరిజన జాతుల విమోచన కోసం పోరాడుతోంది. పాకిస్తాన్‌లోని సింధీలు, పంజాబీలు నివసించే ప్రాంతాలు కొంత మేరకు అభివృద్ధి చెందినప్పటికీ వైశాల్యపరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన బలూచీస్థాన్ మాత్రం ఇప్పటికీ అత్యంత వెనుకబడిన ప్రాంతంగానే ఉంది. రాష్ట్రంలో అపారంగాఉన్న అరుదైన ఖనిజాలు, చమురు, సహజ వాయు నిక్షేపాలు లాంటి వాటిని తరలించుకుపోతున్న ఇస్లామాబాద్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే అసంతృప్తి స్థానిక ప్రజల్లో చాలా కాలంగా గూడుకట్టుకుని ఉంది. దీంతో ఈ ప్రాంతంలో చాలా కాలంగా తిరుగుబాటు ఉద్యమాలు బలపడ్డాయి. 2007లో బాలాచ్ మర్రి నాయకత్వంలో ఏర్పడిన బలూచీస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇటీవలి కాలంలో బలమైన సంస్థగా ఎదిగింది. ఇటీవలి కాలంలో బిఎల్ఎ 70కి పైగా ప్రధాన దాడులు జరిపినట్లు అంచనా. తాజాగా ఓ వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్న తరుణంలో పలు తిరుగుబాటు గ్రూపులు మూకుమ్మడిగా పాక్ సైన్యంపై పెద్ద ఎత్తున దాడి చేసి 16 మంది సైనికులను హతమార్చాయి. బలూచిస్థాన్‌లోని ప్రధాన నగరమైన క్వెట్టా ఇప్పుడు తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బిఎల్ఎ పాకిస్థాన్ నుంచి విడిపోయి కొత్త దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆ సంస్థ కోరడం భారత ప్రభుత్వానికి కొంత సంకట పరిస్థితిని తెచ్చిపెట్టిందనే చెప్పాలి. ప్రత్యేక బలూచిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థించినట్లయితే దౌత్యపరంగా అది పాక్‌ను మరింతగా బలహీనపరిచినట్లవుతుంది. కానీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిపోవడానికి కారణమవుతుంది. అందుకే ఈ విషయంలో భారత్ మౌనంగా ఉండడం మంచి వ్యూహమేనని చెప్పాలి. మరో వైపు చైనా వేల కోట్ల డాలర్లు పెట్టుబడులు పెడుతున్న గ్వాడార్ పోర్టు, చైనాపాక్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) బలూచిస్థాన్ ప్రాంతంలోనే ఉన్నాయి. అయితే స్వతంత్ర బలూచిస్థాన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లుగా తిరుగుబాటుదారులు చేసిన ప్రకటనకు ప్రపంచ దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి మద్దతూ లభించకపోయినప్పటికీ తమ ఉద్యమం ఆగిపోదని, మరింత బలపడుతుందనే సందేశాన్ని మాత్రం అది ఇచ్చింది. ఒకవేళ భారతదేశం డిమాండ్ చేస్తున్నట్లుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి అప్పగించడంతోపాటుగా అటు బలూచిస్థాన్‌ను కూడా కోల్పోవలసి వచ్చినట్లయితే పాక్ ముక్కలయినట్లేనని చెప్పాలి. తమ హక్కులకోసం బలూచీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదే అయినప్పటికీ వారు ఎంచుకున్న మార్గం అంత సులువైనది, ఇప్పటికిప్పుడు నెరవేరేది మాత్రం కాదనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం. ఒకవేళ తిరుగుబాటుదారులు తమ పోరాటంలో విజయం సాధించడమే జరిగితే దక్షిణాసియా భౌగోళిక స్వరూపమే మారిపోవడం ఖాయం.

# ఫలిస్తున్న మోదీ ప్రభుత్వ ప్రయత్నాలు..
# ప్రపంచంలో 4వ అతిపెద్ద దేశంగా భారత్!



భారత ప్రభుత్వం అనేక రంగాలపై ఏకకాలంలో పనిచేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2014-15లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో %వి%5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి %వి%7.2 బిలియన్లకు పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ విస్తరణ భారతీయ సముద్ర ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌ను, అధిక విలువ కలిగిన మార్కెట్లలోకి ప్రవేశించడానికి ఎగుమతిదారులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. గత దశాబ్దంలో భారతదేశ సముద్ర ఎగుమతులు పరిమాణం, విలువ పరంగా బలమైన వృద్ధిని కనబరిచాయని, ప్రపంచ సముద్ర ఆహార వాణిజ్యంలో దేశాన్ని ప్రధాన పాత్రధారిగా నిలబెట్టాయని అధికారి తెలిపారు. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్య రంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

# డోనాల్డ్ ట్రంప్ సర్కార్ మరో సంచలన నిర్ణయం..
# సామాన్య భారతీయుల జేబుకు చిల్లు!



మీరు అమెరికాలో నివసిస్తూ భారతదేశంలోని మీ కుటుంబానికి డబ్బు పంపుతుంటే, ఈ వార్త మిమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేయవచ్చు! NRIలకు అమెరికా మరో బిగ్ షాక్ ఇవ్వబోతుంది. అమెరికా పార్లమెంటులో కొత్త బిల్లు ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం. రిపబ్లిక్ పార్టీ కొత్తగా ఒక పన్ను చట్టాన్ని తీసుకురావాలని చూస్తోంది. ఇదే జరిగితే అమెరికాలోని లక్షలాది మంది భారతీయులకు పెద్ద ఎదురుదెబ్బ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ది వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పేరుతో కొత్త పన్ను చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నారు. అమెరికాలో ఉన్న విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు పంపే నగదు బదిలీలపై 5 శాతం పన్ను విధించాలని ఆయన సూచించారు. ఈ కొత్త రెమిటెన్స్ పన్ను ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా ప్రతినిధుల సభలో బిల్లుగా ప్రవేశపెడతారు. ఇది అమల్లోకి వస్తే, అమెరికాలో పనిచేస్తున్న %ఎ%-1బీ వీసాదారులు, గ్రీన్ కార్డు కలిగినవారు, NRI లు తాము పంపే డబ్బుపై 5 శాతం అదనపు భారం మోపాల్సి వస్తుంది. రియల్ ఎస్టేట్, విద్య, వైద్య ఖర్చుల కోసం తమ దేశానికి డబ్బు పంపే NRI లపై భారీగా భారం పడనుంది. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 11వందల 60 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే, అందులో ఐదు శాతం.. రూ.5వేలను పన్నుగా చెల్లించాలి. హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే..! అమెరికా పార్లమెంటులో సమర్పించబోయే ఈ కొత్త బిల్లు 389 పేజీల పొడవు ఉంది. పేజీ నంబర్ 327లో ఒక లైన్ రాసి ఉంది. అమెరికా పౌరుడు కాకపోతే, %ఖూ% వెలుపలకు పంపిన డబ్బుపై 5 శాతం పన్ను విధించడం జరుగుతుంది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, రెమిటెన్స్ రూపంలో అత్యధికంగా ఆదాయం పొందే దేశంగా భారత్ 2008 నుంచి మొదటిస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది ప్రపంచ మొత్తం రెమిటెన్స్‌లలో 14 శాతం భారత్‌కు వచ్చిందని అంచనా. అమెరికా ప్రభుత్వ నిర్ణయం, లక్షలాది మంది భారతీయ ప్రవాసులకు ఆర్థికంగా కొత్త భారంగా మారే అవకాశముంది. ఇది %చీ=×%లపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అమెరికాలో దాదాపు 45 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది %ఎ-1దీ% లేదా %బూ%-1 వీసాపై, గ్రీన్ కార్డ్ హోల్డర్లు ఉన్నారు. ఈ వ్యక్తులు ప్రతి నెలా ఇంటికి డబ్బు పంపుతారు. కొన్నిసార్లు వారి తల్లిదండ్రుల మందుల కోసం, కొన్నిసార్లు వారి సోదరి, సోదరుల చదువు కోసం, కొన్నిసార్లు ఎవరికైనా వివాహానికి సహాయం చేయడానికి.. ఇలా పంపించే వాటన్నింటిపై ట్రంప్ ప్రభుత్వం పన్ను విధించబోతోంది. 2023-24 సంవత్సరంలో, భారతదేశం అమెరికా నుండి 32 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌ను అందుకుంది. దీనిపై మనం 5% పన్ను విధిస్తే, భారతీయులు ఏటా దాదాపు 1.6 బిలియన్ డాలర్ల అదనపు భారాన్ని మోయవలసి ఉంటుంది. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు రూ. 5,000 లేదా రూ. 5 లక్షలు పంపినా, ప్రతి బదిలీపై ఈ పన్ను విధించడం జరుగుతుంది. మే 26 నాటికి అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు ఆమోదం పొందేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జూలై 4 (అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం) నాటికి దీనిని చట్టంగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అంటే, అది ఆమోదం పొందితే, జూలై నుండే డబ్బు పంపడంపై 5% పన్ను ప్రారంభమవుతుంది.

# భారత్-పాక్ వివాదంలో దూరాలని
# చూస్తున్న ట్రంప్‌నకు ఇజ్రాయెల్ స్ట్రాంగ్ వార్నింగ్!



మొన్నటిదాకా భారత్-పాక్ గొడవతో తమకేమీ సంబంధం లేదన్న అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, కాల్పుల విరమణ కాగానే, మాటమార్చారు. ఇదంతా తనవల్లే అంటున్నారు. ట్రంప్ వ్యాఖ్యలను భారత్ ఖండించినా, ఆయన వైఖరిలో మాత్రం మార్పు రాలేదు. క్రెడిట్ కోసం తెగ ఆరాటపడుతున్నారు. ఇటీవల సౌదీలోని రియాద్‌లో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లోనూ ట్రంప్ ఇలాగే మాట్లాడారు. భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత, ట్రంప్ ప్రతిచోటా దాని క్రెడిట్ తీసుకుంటున్నారు. తన సౌదీ పర్యటన సమయంలో తన ప్రసంగంలో తనను తాను ప్రశంసించుకున్నాడు. భారత్-పాకిస్తాన్ శాంతికి ఘనతను తీసుకున్నాడు. అంతే కాదు, కాశ్మీర్ సమస్యను పరిష్కరిస్తానని కూడా ట్రంప్ అన్నారు. ఆ తరువాత అతనికి భారత ప్రభుత్వం నుండి తగిన సమాధానం వచ్చింది. అయితే తాజాగా ట్రంప్ తీరుపై అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రుడు ఇజ్రాయెల్ తిరస్కరిస్తోంది. ట్రంప్ శాంతికర్తగా ఉండటానికి ఆసక్తిగా ఉన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, హౌతీలు-సిరియా, భారత్-పాకిస్తాన్‌లో శాంతి కోసం అనేక ఒప్పందాలు, చర్చలు జరుగుతున్నాయి. హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడానికి ఆయన హమాస్‌తో ప్రత్యక్ష చర్చలు కూడా ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తీరుపై ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడానికి అమెరికా నిరంతర ప్రయత్నాల తర్వాత, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు గాజాలో ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని ఆపడానికి "ఎటువంటి మార్గం" లేదని అన్నారు. బందీలను విడుదల చేయడానికి ఒప్పందం కుదిరినప్పటికీ, హమాస్ అంతమయ్యే వరకు తన ప్రచారం కొనసాగుతుందని ఆయన అన్నారు.ట్రంప్ మధ్యప్రాచ్యానికి వచ్చిన రోజున గాజాలోని రెండు ఆసుపత్రులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఇందులో కనీసం ఎనిమిది మంది మరణించారు. డజన్ల కొద్దీ గాయపడ్డారు. నెతన్యాహు వ్యాఖ్యలు కాల్పుల విరమణ చర్చలను క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు హమాస్ చేసిన సంజ్ఞ ద్వారా ఈ చర్చలు పునరుద్ధరించారు. హమాస్ అమెరికన్ బందీలను విడుదల చేసినప్పుడు మాత్రమే ముందడుగు పడనుంది. ట్రంప్ ప్రస్తుతం మధ్యప్రాచ్య పర్యటనలో ఉన్నారు. తన పేరుకు మరో కాల్పుల విరమణను క్రెడిట్ తీసుకోవాలని ఆశిస్తున్నారు. అదే సమయంలో, నెతన్యాహు వైఖరి ఆయనకు, ట్రంప్ కు మధ్య పెరుగుతున్న అంతరాన్ని సూచిస్తుంది. ఈ పరిణామాలను చూస్తుంటే, అమెరికా-ఇజ్రాయెల్‌కు ఈ విధంగా సహాయం చేస్తూనే ఉంటుందా లేదా దానిలో కోత విధిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.

## బిజెపి మంత్రి విజయ్ షాపై సుప్రీం అక్షింతలు.. సిట్ ఏర్పాటు



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ గురించి మీడియాకు వివరించిన భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది ధర్మాసనం. కల్నల్ సోఫియా ఖురేషిని "ఉగ్రవాదుల సోదరి" అని అన్నందుకు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మంత్రి విజయ్ షా సుప్రీంకోర్టుకు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విచారించిన సుప్రీంకోర్టు.. "మీరు ఒక ప్రజా వ్యక్తి. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు. మీరు ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. ఇది సాయుధ దళాలకు ముఖ్యమైన విషయం. మనం చాలా బాధ్యతాయుతంగా ఉండాలి. మీరు చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలంతా సిగ్గుతో తలవంచుకోవాల్సి వచ్చింది" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలను విచారించడానికి ఒక మహిళా అధికారితో సహా ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మంత్రి విజయ్ షా అరెస్టును నిలిపివేయాలని.. కానీ ఆయన సిట్‌కు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 28వ తేదీ లోపు విచారణకు సంబంధించిన నివేదికను అందజేయాలని సుప్రీంకోర్టు తెలిపింది.

## ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతాం




హైదరాబాద్: పాలమూరు బిడ్డల చెమటతోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు అంటే తనకు ఎంతో గౌరవం అని అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెడతానని చెప్పారు. ఈ సందర్భంగా పాలమూరులో సిఎం మాట్లాడుతూ..గిరిజనల కోసం ప్రత్యేక పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ది అని చెప్పారు. అచ్చం పేటలో ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతామని తెలియజేశారు. సోలార్ విద్యుత్ అందించడమే కాదు.. ఆదాయం వచ్చేలా చేస్తామని రుణమాఫీ చేశామని తెలియజేశారు. వడ్లకు బోనస్ ఇస్తున్నామని, వరి వేసుకుంటే ఉరేనన్న దొర మాత్రం వరి వేసి అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 60 వేల కోట్లు ఖర్చు చేశామని, 50 లక్షల పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. మహిళలే ఆర్టిసి బస్సులు అద్దెకు తప్పుకునేలా చేశామని, మహిళా సంఘాలను పెట్రోలు బంకులకు యజమానులను చేశామని పేర్కొన్నారు. .2029 లోపు కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇజ్రాయిల్ తాజా దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మృతి



గాజా : పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ వైమానిక దాడికి 22 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని రెస్క్యూ సిబ్బంది సోమవారం తెలిపారు. ప్రధానంగా ఈరోజు గాజాలో దక్షిణ ప్రధాన నగరమైన ఖాన్ యూనిస్‌తోపాటు చుట్టుపక్కల ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల వల్ల 11 మంది మృతి చెందారని, అనేమంది గాయాలపాలయ్యారని పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహమూద్ బస్సాల్ తెలిపారు. అలాగే అబాసాన్‌లో మరొకరు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. జబాలియా పట్టణానికి పశ్చిమాన ఉన్న మార్కెట్ సమీపంలో జరిగిన వైమానిక దాడిలో ఐదుగురు మృతి చెందారు. గాజా మధ్యలో ఉన్న నుసెయిరాట్‌లో ఉన్న గుడారంపై వైమానిక దాడికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఉత్తరాన ఉన్న గాజా నగరంలో జరిగిన దాడికి ఒకరు చనిపోయారు. ఇదిలా ఉండగా గాజ స్ట్రిప్ అంతటా దాడులకు పాల్పడుతున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం సోమవారం వెల్లడించింది.


## విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలా

### - విజయ్ షాని చీవాట్లు పెట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాని సుప్రీంకోర్టు సోమవారం చీవాట్లు పెట్టింది. విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలు చెబుతారా అని నిలదీసింది. మంత్రిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. మంత్రివి నిరర్ధకమైన, బుద్ధిహీనమైన వ్యాఖ్యలు అని జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. విచారణ నుండి తప్పించుకునేందుకు కోర్టుకు క్షమాపణ చెప్పడంలో అర్థంలేదని అన్నారు. విజయ్ షా వ్యాఖ్యలు చేసిన వీడియో క్లిప్‌లను ధర్మాసనం వీక్షించిందని, ఆ క్లిప్‌లను కోర్టుకు కూడా తీసుకువెళ్లిందని అన్నారు. ఆ వీడియోల్లో చాలా అసభ్యకరమైన, దుర్వినియోగమైన పదాలను వాడారని మండిపడ్డారు. ఒక ప్రజాప్రతినిధి, అనుభవజ్ఞులైన రాజకీయ నేత బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి పదాన్ని ఆచితూచి మాట్లాడాలని అన్నారు. మీ వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. మధ్యప్రదేశ్ కేడర్, డైరెక్ట్ రిక్రూట్ చేయబడిన ఐపిఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని ధర్మాసనం రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. అయితే ఈ ముగ్గురు సభ్యుల్లో రాష్ట్రానికి చెందినవారు ఉండకూడదని, వారిలో ఒక మహిళ ఉండాలని పిఎస్ సూచించింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదా కలిగిన ఐఅధికారి సిట్‌కి నేతృత్వం వహించాలని, మిగిలిన ఇద్దరూ ఎస్‌పి హోదా కలిగి ఉండాలని పేర్కొంది. మే 20 ఉదయం పది గంటలలోపు సిట్‌ను నియమించాలని సూచించింది. దర్యాప్తు వివరాలను సిట్ స్టేటస్ రిపోర్ట్‌లో సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అరెస్ట్ నుండి మినహాయింపు కల్పించిన కోర్టు .. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది. తదుపరి విచారణను మే 28కి వాయిదా వేసింది.

# చీకటి వెలుగులు




ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి. మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు. భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీథిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం. ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం శ్రుతిమించి మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలను నెలకొల్పారు. ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్డిక్ గ్రామంలో ఉందది. 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా' అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞాననిధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది ద్విభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లాయెట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు వాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో చాలా మార్పులు జరిగాయి. జాన్ గూటెన్‌బర్గ్ రూపొందించిన ముద్రణ యంత్రం పుస్తకాల రూపురేఖలను మార్చేసింది. ఆధునిక పుస్తకాలకు అంకురారోపణ చేసింది. పారిశ్రామిక విప్లవ కాలంలో పుస్తకాల ముద్రణ పెరగడం మొదలైంది. వలస పాలనలు మొదలవడంతో ప్రజలకు బహుభాషా పరిచయం ఏర్పడి, సమాచార ఆదాన ప్రదానాలు ఊపందుకున్నాయి. బ్రిటిష్ హయాంలో మన దేశంలో నాటి కలకత్తా నగరంలో 'ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ' పేరుతో తొలి ఆధునిక గ్రంథాలయం 1781లో ఏర్పడింది. అప్పటికి సతీసహగమన దురాచారంపై ఇంకా నిషేధం విధించలేదు. మన తెలుగునేల మీద 1886లో తొలి ఆధునిక గ్రంథా లయాన్ని విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణమూర్తి నెలకొల్పారు. అప్పటికి కన్యాశుల్కం దురాచారం తీవ్రంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అయ్యంకి వెంకటరమణయ్య నేతృత్వంలో గ్రంథాలయోద్యమం కూడా మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతికత సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా కంబళూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. 'జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

# ముక్కలు కానున్న పాకిస్థాన్!




భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో బెంబేలెత్తిపోతున్న పాకిస్తాన్‌కు నైరుతి ప్రాంతంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బిఎల్ఎ) నుంచి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్వయంపాలన కోసం పోరాడుతున్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు అదను చూసి మరీ పాక్ సైన్యంపై దాడులను ఉధృతం చేస్తున్నారు. తాడోపేడో తేల్చుకోవడానికి ఇదే తగిన సమయమని భావించినవారు మరో అడుగు ముందుకువేసి తమ ప్రాంతాన్ని బలూచిస్థాన్ రిపబ్లిక్‌గా ప్రకటించుకున్నారు. పోరాటయోధుడు మిర్ యార్ బలూచ్ నేతృత్వంలో బలూచిస్థాన్ నేతలు ఈ నెల 9న పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అంతేకాకుండా పాక్‌పై భారత్ చేస్తున్న దాడులకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటుగా ఆ పోరాటానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. మరో వైపు బలూచిస్థాన్ రిపబ్లిక్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, తమ దేశాల్లో బలూచిస్థాన్ దౌత్య కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని ఐక్యరాజ్యసమితితో పాటుగా అన్ని ప్రపంచ దేశాలకు వారు విజ్ఞప్తి చేశారు కూడా. చూడడానికి ఇది ఓ మామూలు ప్రకటనగా కనిపిస్తున్నప్పటికీ దీని ప్రభావం పాకిస్తాన్ సుస్థిరతపైనా, అలాగే దక్షిణాసియా భౌగోళిక పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే భౌగోళికంగా పాకిస్తాన్‌లో అతిపెద్ద ప్రావియన్స్ అయిన బలూచిస్థాన్ గత కొన్ని దశాబ్దాలుగా అశాంతికి నిలయంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం తమ వనరులను దోచుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఇక్కడి ప్రజలను నిరుపేదలుగా మారుస్తోందని స్థానికులు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. అందుకే తమకు స్వయం పాలనాధికారం కావాలంటూ అక్కడి వారు పోరాటం చేస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతంలో బలవంతపు కిడ్నాప్‌లు, చట్ట వ్యతిరేక హత్యలు లాంటివి ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో పెచ్చుమీరిపోయాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల నివేదికలు చెబుతున్నాయి. వీటన్నిటినీ భరించలేని తిరుగుబాటుదారులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరిట గత కొంత కాలంగా పాకిస్తాన్ సైన్యమే లక్ష్యంగా దాడులు కొనసాగిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా పెద్ద సంఖ్యలో పాక్ సైనికులను మట్టుబెడుతూ పాక్ ఫెడరల్ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. గత మార్చిలో క్వెట్టానుంచి పెషావర్‌కు 400 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును బిఎల్ఎ తిరుగుబాటుదారులు హైజాక్ చేయడం వారి ఉద్యమంలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. ప్రయాణికులను విడిపించడానికి పాక్ సైన్యం బ్రహ్మప్రయత్నమే చేయాల్సి వచ్చింది. పాక్ ప్రభుత్వం నిషేధిత ఉగ్రవాద సంస్థగా ముద్రవేసిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని బలూచీ గిరిజన జాతుల విమోచన కోసం పోరాడుతోంది. పాకిస్తాన్‌లోని సింధీలు, పంజాబీలు నివసించే ప్రాంతాలు కొంత మేరకు అభివృద్ధి చెందినప్పటికీ వైశాల్యపరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన బలూచీస్థాన్ మాత్రం ఇప్పటికీ అత్యంత వెనుకబడిన ప్రాంతంగానే ఉంది. రాష్ట్రంలో అపారంగాఉన్న అరుదైన ఖనిజాలు, చమురు, సహజ వాయు నిక్షేపాలు లాంటి వాటిని తరలించుకుపోతున్న ఇస్లామాబాద్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే అసంతృప్తి స్థానిక ప్రజల్లో చాలా కాలంగా గూడుకట్టుకుని ఉంది. దీంతో ఈ ప్రాంతంలో చాలా కాలంగా తిరుగుబాటు ఉద్యమాలు బలపడ్డాయి. 2007లో బాలాచ్ మర్రి నాయకత్వంలో ఏర్పడిన బలూచీస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇటీవలి కాలంలో బలమైన సంస్థగా ఎదిగింది. ఇటీవలి కాలంలో బిఎల్ఎ 70కి పైగా ప్రధాన దాడులు జరిపినట్లు అంచనా. తాజాగా ఓ వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్న తరుణంలో పలు తిరుగుబాటు గ్రూపులు మూకుమ్మడిగా పాక్ సైన్యంపై పెద్ద ఎత్తున దాడి చేసి 16 మంది సైనికులను హతమార్చాయి. బలూచిస్థాన్‌లోని ప్రధాన నగరమైన క్వెట్టా ఇప్పుడు తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బిఎల్ఎ పాకిస్థాన్ నుంచి విడిపోయి కొత్త దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆ సంస్థ కోరడం భారత ప్రభుత్వానికి కొంత సంకట పరిస్థితిని తెచ్చిపెట్టిందనే చెప్పాలి. ప్రత్యేక బలూచిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థించినట్లయితే దౌత్యపరంగా అది పాక్‌ను మరింతగా బలహీనపరిచినట్లవుతుంది. కానీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిపోవడానికి కారణమవుతుంది. అందుకే ఈ విషయంలో భారత్ మౌనంగా ఉండడం మంచి వ్యూహమేనని చెప్పాలి. మరో వైపు చైనా వేల కోట్ల డాలర్లు పెట్టుబడులు పెడుతున్న గ్వాదార్ పోర్టు, చైనాపాక్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) బలూచిస్థాన్ ప్రాంతంలోనే ఉన్నాయి. అయితే స్వతంత్ర బలూచిస్థాన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లుగా తిరుగుబాటుదారులు చేసిన ప్రకటనకు ప్రపంచ దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి మద్దతూ లభించకపోయినప్పటికీ తమ ఉద్యమం ఆగిపోదని, మరింత బలపడుతుందనే సందేశాన్ని మాత్రం అది ఇచ్చింది. ఒకవేళ భారతదేశం డిమాండ్ చేస్తున్నట్లుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి అప్పగించడంతోపాటుగా అటు బలూచిస్థాన్‌ను కూడా కోల్పోవలసి వచ్చినట్లయితే పాక్ ముక్కలయినట్లేనని చెప్పాలి. తమ హక్కులకోసం బలూచీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదే అయినప్పటికీ వారు ఎంచుకున్న మార్గం అంత సులువైనది, ఇప్పటికిప్పుడు నెరవేరేది మాత్రం కాదనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం. ఒకవేళ తిరుగుబాటుదారులు తమ పోరాటంలో విజయం సాధించడమే జరిగితే దక్షిణాసియా భౌగోళిక స్వరూపమే మారిపోవడం ఖాయం.

# 'విరమణ'పై విమర్శల జడివాన




భారత్- పాకిస్తాన్ మధ్య ఇటీవల సైనిక ఉద్రిక్తతలు, మే 10, 2025న కాల్పుల విరమణతో ముగిసినప్పటికీ ఈ నిర్ణయం చుట్టూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్రచర్చలు జరుగుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, స్పష్టమైన సైనిక ఆధిపత్యం చాటిన భారత్, విజయం సాధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్న సమయంలో కాల్పుల విరమణకు అంగీకరించడం వివాదాస్పదమైంది. ఈ నిర్ణయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనవసర జోక్యం, ఆయన చేసిన అసందర్భ వ్యాఖ్యలు భారత ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శల తాకిడికి దారితీశాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం అసాధారణ పటిమతో ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. పాకిస్థాన్ యుద్ధ సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీసిన ఈ ఆపరేషన్, భారత్‌ను ఆధిపత్య స్థానంలో నిలిపింది. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లు, మిస్సైళ్లు నాశనమయ్యాయి. ఈ నేపథ్యంలో మోడీ సర్కార్ అనూహ్యంగా కాల్పుల విరమణకు అంగీకరించడం ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో కాల్పుల విరమణను తానే సాధించానని, భారత్ పాక్‌లు తన మాట విన్నాయని పదే పదే ప్రకటించడం ప్రధాని మోడీ ఇమేజ్‌ను నవ్వులపాలు చేసింది. భారత విదేశాంగ విధానాన్ని ప్రశ్నార్థకం చేసింది. ఈ వ్యాఖ్యలు, 1972 సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించేలా మూడో పక్షజోక్యాన్ని సూచిస్తాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మీడియాలో మోడీ నిర్ణయం బలహీనతగా చిత్రీకరించబడుతోంది. అంతర్జాతీయంగా బిబిసి, ఒన్ న్యూస్ బిడి వంటి సంస్థలు ట్రంప్ మధ్యవర్తిత్వం భారత్‌ను ఇరకాటంలోకి నెట్టిందని విశ్లేషించాయి. ట్రంప్ కశ్మీర్ సమస్యలో మధ్యవర్తిత్వం ప్రతిపాదించడం, భారత్ ముఖ్యంగా భారత ప్రధాన మంత్రి హోదాలో దాన్ని దృఢంగా, స్పష్టంగా తిరస్కరించి మాట్లాడలేకపోవడం విమర్శలను మరింత తీవ్రతరం చేసింది. సోషల్ మీడియాలో నెటిజన్లు మోడీ నిర్ణయం భారత ఇమేజ్‌ను దెబ్బతీసిందని, బిజెపి (మోడీ) అమెరికా (ట్రంప్) ఒత్తిడికి తలొగ్గినట్లేనని, భారత ప్రతిష్ఠను దిగజార్చేలా మోడీ మోకరిల్లటం భారత ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. భారత సైనిక వీరోచిత పోరాటాన్ని మసక బారేలా ఈ అర్ధంతర యుద్ధవిరమణ నిర్ణయం నీరుగార్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ వంటి సంస్థల నుంచి, వ్యక్తిగతంగా మోడీ అభిమానులు నుండి కూడా ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మొత్తానికి ఈ నిర్ణయంపై భారత దేశంలో ఏ వర్గమూ సమర్థించేలా లేదు. చావుదెబ్బ తిన్న పాకిస్తాన్ ప్రజలు ఉత్సాహంగా వీధుల్లో ఊరేగింపు చేసుకుంటున్నారు. అన్ని విధాలా మన సైనికులు పైచేయి సాధించినా ఈ నిర్ణయంతో ప్రజల్లో నిరాశ, నిస్పృహ, నిస్సత్తువ ఆవరించింది. బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ వంటి సంస్థల నుంచి కూడా అసంతృప్తి స్వరాలు ఉచ్ఛస్థాయిలో వినిపిస్తున్నాయి. ఈ సంస్థలు దీర్ఘకాలంగా ఉగ్రవాదంపై, పాకిస్థాన్‌పై గట్టి వ్యతిరేక వైఖరిని కలిగి ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను జాతీయ గర్వంగా కొనియాడిన ఈ సంస్థలు, కాల్పుల విరమణ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. సోషల్ మీడియాలో బిజెపి అనుకూల ఖాతాల (గోది మీడియా) నుండి 'మోదీ నిర్ణయాన్ని' తక్కువ స్వర స్థాయిలో సమర్థిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఈ నిర్ణయం జాతీయవాద భావనలకు విరుద్ధమని భావిస్తున్నారు. తమ అధికార పత్రికలో కూడా ఇదే భావం వ్యక్తం చేశారు. మోడీ నిర్ణయం వెనుక దౌత్యపరమైన ఒత్తిళ్లు, ఆర్థిక సంబంధాలు, అంతర్జాతీయ ఒప్పందాలు కారణమై ఉండవచ్చు. ట్రంప్ వాణిజ్య బెదిరింపులు, అమెరికాతో వ్యాపార సంబంధాలు ఈ నిర్ణయంలో కీలక పాత్ర పోషించాయి అని విశ్లేషకులు అంటున్నారు. అయితే, ఈ నిర్ణయం సైనిక విజయాన్ని దౌత్యపరమైన రాజీగా మార్చిందని, భారత్ బలమైన స్థితిని చేజేతులా వదులుకుందని విమర్శలు వస్తున్నాయి.

మోడీ తన ప్రసంగంలో ఉగ్రవాదంపై గట్టి వైఖరిని పునరుద్ఘాటించినప్పటికీ ట్రంప్ జోక్యాన్ని స్పష్టంగా తోసిపుచ్చలేకపోవడం విమర్శలకు ఆజ్యం పోసింది. ఈ సంఘటన భారత విదేశాంగ విధానంలో కీలక చర్చను రేకెత్తించింది. సిమ్లా ఒప్పందం స్ఫూర్తిని కాపాడుకోవడం, అంతర్జాతీయ ఒత్తిళ్లను సమతుల్యం చేయడం భారత్‌కు సవాలుగా మారింది. మోడీ నిర్ణయం దీర్ఘకాలంలో శాంతిని, స్థిరత్వాన్ని తెస్తుందా? లేక దేశ ప్రతిష్ఠకు బలహీనతగా మిగిలిపోతుందా అనేది సమయమే నిర్ణయిస్తుంది. అప్పటివరకు, ఈ విమర్శలు భారత రాజకీయ, సామాజిక వాతావరణంలో తీవ్ర చర్చనీయాంశంగా కొనసాగుతాయి.

## దేశవ్యాప్తంగా అతి భారీ వర్షాలు : ఐఎండి



అమరావతి : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. ఈసారి నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా దేశాన్ని తాకనున్నాయని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 24వ తేదీనే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఇవి అండమాన్ నికోబార్ దీవులందంతట విస్తరించాయని, అనుకున్న సమయం కంటే ఐదు రోజుల ముందుగానే ఇవి అండమాన్‌ను చేరాయని తెలిపారు. ముందుగా ఈ నెల 27వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండి అంచనా వేసిన విషయం తెలిసిందే. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కేరళ, కర్నాటక, గోవా, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తాంధ్ర, తెలంగాణకి కూడా వర్ష సూచన ఉందని చెప్పింది. అటు అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఇక ఢిల్లీ, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల్లో ధూళి తుఫాన్లు వచ్చే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ఇప్పటికే బెంగళూరులో కుండపోత వాన కురుస్తోంది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఆగ్నేయ బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగానే ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ప్రకటించారు.

## తెలంగాణలో పెరగనున్న మద్యం ధరలు



హైదరాబాద్ : తెలంగాణలో నేటి నుండి మద్యం ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఫుల్ బాటిల్‌కు రూ.40, హాఫ్ బాటిల్‌కు రూ.20 మరియు క్వార్టర్ బాటిల్ రూ.10 వరకు ధరల పెరుగుదల ఉండవచ్చు. అధికారికంగా ఇంకా ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ఆదివారం డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడం, సవరించిన రేట్లతో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంలో మార్పులు జరుగుతున్నాయని సూచిస్తుంది. అధికారిక ప్రకటన లేదని, ధరల స్థిరీకరణ కమిటీ ఇప్పటికే మద్యంపై 10% నుండి 15% పెంపును సూచించిందని అధికారులు చెబుతున్నారు. అయితే సిఫార్సులను ముఖ్యమంత్రి ఆమోదం పొందాల్సి ఉందని, ఫైల్ ఆయన పరిశీలన కోసం పెండింగ్‌లో ఉందని అధికారులు పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో నెలకు రూ.150 కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని వారు భావిస్తున్నారు. వైన్ డీలర్లకు కూడా ధరల పెరుగుదల గురించి అధికారికంగా సమాచారం ఇవ్వలేదని, ఈ పెంపు కొత్త స్టాక్‌లకు వర్తిస్తుందా లేదా ఉన్న స్టాక్‌కు వర్తిస్తుందా అనేది వారికి స్పష్టత లేదు. మద్యం ఆదాయాన్ని పెంచడం ద్వారా ఖజానా నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం బీర్లు, బార్లపై మాత్రమే ఆధారపడి రాష్ట్రాన్ని పాలిస్తున్నదా అని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీష్ రావు ప్రశ్నించారు.

## టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్?

### మహానాడులో ప్రకటన !



అమరావతి : టిడిపిలో నారా లోకేష్‌కు కొత్త పదవి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాతో పాటు కార్యకర్తల సంక్షేమ నిధి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్‌ను చేసే అవకాశం ఉందని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పార్టీలో, ప్రభుత్వంలో లోకేష్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులను కూడా చూసుకుంటూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధినేతగా ఉన్న చంద్రబాబు నాయుడు పూర్తిగా పాలనపైనే దృష్టి సారించారు. పార్టీ కార్యాకాలపాలపై ఆయన అంతగా దృష్టి సారించడం లేదని, ఎక్కువగా లోకేష్‌కే అప్పగించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే లోకేష్ పార్టీలో యువనాయకులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఇటీవల వైసిపి నేతల ఖాళీతో రాజ్యసభ స్థానాలు ఖాళీ అయిన సంగతి తెలిసిందే. అదేవిధంగా కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఖాళీ అయ్యాయి. ఈ స్థానాల్లో కూడా లోకేష్ తన టీం సభ్యులకే అప్పగించారని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ఆయనకు పార్టీలో ఈసారి కీలక బాధ్యతలు అప్పగించాలని అధినేత ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి హోదా కొంతమంది నేతలకు ఉంది. ఒక పదవిలో ఒక వ్యక్తి మూడుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదని లోకేష్ రెండేళ్ల నుంచి ఖరాఖండిగా చెబుతున్నారు. ఈ నిబంధన ఉండాలని ఇటీవల జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో తీర్మానం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేష్ మూడుసార్లు కంటే ఎక్కువగానే కొనసాగుతున్నారు. ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించే అవకాశం ఉందని చెబుతున్నారు. టిడిపిలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే పదవి లేదు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో ఆ పార్టీ మహానాడు జరగనుంది. ఈ మహానాడులో లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలంటూ తీర్మానం ప్రతిపాదించి ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ పూర్తి బాధ్యతలు ఇక లోకేష్ చూసుకునే అవకాశాలు ఉన్నాయి.

## ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష!



అమరావతి : ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న వ్యాధులను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం అని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. ఈరోజు విజయవాడలో మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు. 'ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష. రాష్ట్రంలో 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారు. 2100 మంది తలసీమియాతో, ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. బాధితులకి క్రమం తప్పకుండా ఉచిత రక్త మార్పిడి చేస్తున్నాం. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, 10 లక్షల 50 వేల మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారు, 2100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నాం. నోడలాఫిసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ జరుగుతుంది' అని మంత్రి సత్యకుమార్ చెప్పారు.

# పుష్కర సరస్వతికి ప్రణామం



ప్రతి నదికి ఏడాదికి ఒక్కసారి పుష్కరాలు జరుగుతాయి. బృహస్పతిలో ఆయా రాశులు ప్రవేశించడంతో ఆ నదికి పుష్కరాలు జరుగుతాయి. ఈనెల 15న గురువారం బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించడంతో ఉదయం 5.44 గంటలకు సరస్వతినదికి పుష్కరాలు ఆరంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం... సరస్వతీ నది పుష్కరాలు ఉత్తరాదిలో నాలుగుచోట్ల, దక్షిణాది లో తెలంగాణలోని కాళేశ్వరంలో మాత్రమే జరుగుతున్నాయి. నది పుట్టినచోటుగా గుర్తించిన ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగా, యమున, సరస్వతి (అంతర్వాహిని)నదులుగా భావించే ప్రయాగ్‌రాజ్, గుజరాత్‌లోని సోమనాథ్, రాజస్థాన్‌లోని పుష్కర్ వద్ద సరస్వతీనదికి పుష్కరాలు జరుగుతున్నాయి.

పుష్కర స్నానం..పుణ్యఫలం..

పుష్కర స్నానం... ఎంతో పుణ్య ఫలం. నది స్నానాలు చేస్తే మానవ జీవన గమనంలో తెలిసో, తెలియకో చేసిన పాపాలు తొలగుతాయని పురాణాల్లో పేర్కొన్నారు..

తర్పణలు, పిండప్రదానాలు..

సాధారణంగా నదీస్నానాల్లో తర్పణం, పిండ ప్రదానం, శ్రాద్ధకర్మ పిండప్రదాన కర్మలు చేసి పితృదేవతలను తృప్తిపరిచి వారి ఆశీస్సులు అందుకోవడం శుభప్రదమని విశ్వసిస్తారు. మొదటిరోజు హిరణ్య శ్రాద్ధం తొమ్మిదోరోజు అన్నశ్రాద్ధం. పన్నెండో రోజు ఆమ శ్రాద్ధం చేయడం మంచిదని పురాణాల్లో పేర్కొన్నారు.

పుష్కరకాల స్నానం..

నీరు నారాయణ స్వరూపం. అందుకే ఆయన స్పర్శతో పాపాలు తొలగిపోతాయని విశ్వాసం. తీర్థ, నదీస్నానాలు ఉత్తమం. దానికన్నా పుష్కరస్నానం ఉత్తమోత్తమం. ఆ సమయంలో దేవతలంతా పుష్కరుడితో నదిలో ప్రవేశిస్తారని విశ్వాసం. పుష్కరకాలంలో స్నానమాచరిస్తే 12 సంవత్సరాల కాలం 12 నదుల్లో స్నానాలు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాల్లో లిఖించబడింది.

నదికి వాయినాలు..

సుమంగళిగా జీవితాంతం ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు పుష్కరాల సందర్భంగా నదీమతల్లికి వాయనాలు సమర్పిస్తారు. ఇలా చేస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని విశ్వాసం, చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పుస్తె, మెట్టెలను పూజించి నదిలోకి జారవిడుస్తారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకుంటారు.

12 రోజులు హోమాలు..

మే 15 గురువారం శ్రీ దత్తా త్రేయ, శ్రీ కార్తవీర్యార్జున హోమం, 16న శుక్రవారం సంకష్ట హర గణపతి హోమం, 17న శనివారం శ్రీ హయగ్రీవ, శ్రీ స్వయంవర పార్వతి హోమం, 18న ఆదివారం శ్రీ పుత్ర కామేష్టి హోమం జరిగాయి. నేడు మేధా దక్షిణామూర్తి మహా అమృత మృత్యుంజయ హోమం, మంగళవారం కాలభైరవ హోమం, బుధవారం సుదర్శన హోమం, గురువారం శ్రీ సూక్త హోమం, శుక్ర వారం పురుష సూక్త హోమం, శనివారం నవగ్రహ, శ్రీ మత్స్య హోమం, ఆదివారం శ్రీ రుద్రహోమం, 26, సోమవారం చండి హోమాలు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

12 రోజులు హారతి..

12 రోజులపాటు సరస్వతిఘాట్ వద్ద కాశీకి చెందిన ఏడుగురు పండితులచే తొమ్మిది నవ రత్నమాలిక హారతులను ఇస్తున్నారు. హారతి వీక్షణకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. హారతి ఇవ్వడానికి ఏడు గద్దెలు ఏర్పాటు చేసి ఏడు జీవనదులు గంగా, యమున, గోదావరి, నర్మద, సింధు, సరస్వతి, కావేరి పేర్లు ఏర్పాటు చేశారు.

పీఠాధిపతుల పుష్కర స్నానాలు..

పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేస్తున్నారు. పుష్కర ప్రారంభం మే 15న మొదటి రోజు శ్రీ గురుమద నానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్‌కు చెందిన మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. మూడవ రోజు మే 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, మే 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యా శంకరభారతీ మహాస్వామి, నేడు నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, మే 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామివార్లు పుష్కర స్నానం ఆచరిస్తారు.

17 అడుగుల ఏకశిల


సరస్వతిమాత విగ్రహంసరస్వతి ఘాటులో 17 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని తమిళనాడులోని మహాబలిపురంలో శిల్పులు ప్రత్యేకంగా రూపు దిద్దారు. ఆ విగ్రహం చుట్టూరా నాలుగు వేదమూర్తులయిన రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వవేదం విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని సరస్వతినది పుష్కరాల సందర్భంగా 15న సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

# సముద్రగర్భంలో పెను విస్ఫోటం!

### బద్దలయ్యేందుకు సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం

### పసిఫిక్‌లో అత్యంత క్రియాశీలకంగా 'సీమౌంట్'

### గతంలో పేలినప్పుడు ఏకంగా 10,000 భూకంపాలు



అగ్నిపర్వతం బద్దలైనప్పుడు నిప్పులు చిమ్ముతూ లావా నింగిలోకి ఎగసిపడటం, విపరీతంగా ధూళి సమీప గ్రామాలపై దుమ్ము దుప్పటి కప్పేయడం టీవీల్లో చూసే ఉంటారు. వీటికి పూర్తిభిన్నమైన అగ్నిపర్వతం అతి త్వరలో బద్దలుకానుందని ఖగోళ శాస్త్రవేత్తలు ప్రకటించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఆస్టోరియా నగర తీరానికి 300 మైళ్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రం లోపల ఈ అగ్నిపర్వతం దాగి ఉంది. దీని పేరు యాక్సియల్ సీమౌంట్. భూ ఉపరితలం మీద కాకుండా పసిఫిక్ మహాసముద్రం ఉపరితలానికి 1.4 కిలోమీటర్ల లోతులో ఉండటమే ఈ అగ్నిపర్వతం ప్రత్యేకత.

### ఎందుకంత ప్రత్యేకత?

ఈ అగ్నిపర్వతం రెండు భూ పలకలు ఢీకొనే చోట ఏర్పడింది. పసిఫిక్ భూ పలక, జువాన్ డీ ఫ్యూకా భూ పలకలు తరచూ అత్యంత స్వల్పంగా కదులుతుంటాయి. ఈ క్రమంలో ఇవి పరస్పరం తగులుతూ భూమి ఉపరితల పొరల కదలికలకు కారణం అవుతున్నాయి. వీటి సమీపంలో ఉన్న ఈ అగ్నిపర్వతం త్వరలో బద్దలయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీలోని హ్యాట్‌ఫీల్డ్ మెరైన్ సైన్స్ సెంటర్‌లో పరిశోధకుడైన బిల్ చాడ్విక్ ఈ వివరాలను వెల్లడించారు. "భూకేంద్రంలో ద్రవరూపంలోని శిలలు అగ్నిపర్వతం ద్వారా బయటకు వస్తాయి. ఈ శిలాద్రవం (మాగ్మా) వెంటనే సముద్ర జలాలకు తగిలి చల్లబడుతుంది. ఈ క్రమంలో అక్కడి సముద్ర జలాలు వేడెక్కుతాయి" అని చాడ్విక్ చెప్పారు. వేల కొద్దీ భూకంపాలు! "అగ్నిపర్వతం ఎత్తు కేవలం 3,300 అడుగులు. కానీ అత్యంత క్రియాశీలంగా తయారైంది. ఇటీవలికాలంలో శిలాద్రవం బయటికొచ్చే అవకాశాలు ఎక్కువయ్యాయి. భూమి కంపిస్తోంది. అగ్నిపర్వతం తాజా స్థితిని తెల్సుకునేందుకు మేం సమీప ప్రాంతం దాకా కేబుల్ వ్యవస్థ ద్వారా భూకంప తీవ్రతలను కనిపెట్టే ఏర్పాట్లుచేశాం" అని ఆయన చెప్పారు. " అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు భూమి వందల సార్లు కంపిస్తుంది. ఇక అగ్నిపర్వతం బద్దలైన సందర్భాల్లో వేల సార్లు కంపిస్తుంది. 2015 ఏప్రిల్‌లో చివరిసారిగా అగ్నిపర్వతం బద్దలైంది. అప్పుడు విపరీతంగా శిలాద్రవం బయటకు ఎగజిమ్మింది. అప్పుడు 24 గంటల వ్యవధిలో ఈ ప్రాంతంలో 10,000 చిన్నపాటి భూకంపాలు వచ్చాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భూమి కంపించే వీలుంది" అని 'యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ ఓషనోగ్రఫీ'లో మెరైన్ జియోఫిజిసిస్ట్, ప్రొఫెసర్ విలియం విల్‌కుక్ స్పష్టంచేశారు. జీవవైవిధ్యానికి బాసట అగ్నిపర్వతం బద్దలైనప్పుడు భారీ స్థాయిలో శిలాద్రవం మహాసముద్రజలాల్లో కలిసిపోతుంది. ఈ శిలాద్రవంలో ఎన్నో రకాల మూలకాలు ద్రవరూపంలో ఉంటాయి. ఇవన్నీ సముద్రజలాల్లో సమ్మిళితమై అక్కడి సూక్ష్మజీవులకు ఆహారంగా మారతాయి. ఈ సూక్ష్మజీవులపై ఆధారపడిన చిన్న జలచరాలు, వాటిని ఆహారం తీసుకునే చేపలు.. ఇలా ఆహార చక్రం సదా సవ్యంగా కొనసాగేందుకు అగ్నిపర్వతం పరోక్షంగా సాయపడుతోంది. అత్యంత వేడితో సెగలు కక్కే మాగ్మా సముద్ర ఉపరితలానికి ఎగసిపడగానే అక్కడ జీవులు కొన్ని చనిపోయినా తర్వాత మాత్రం అక్కడ జీవరాశి పెరుగుదలకు దోహదపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్రంలో జీవం మనుగడకు అగ్నిపర్వతాలు సైతం తమ వంతు సాయం చేస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో మెరైన్ జియోలజీ, జియోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ డెబీ కెల్లీ వ్యాఖ్యానించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లకు కారణాలు ఇవే..


**పాత వైరింగ్.. సామర్థ్యానికి మించి ఎలక్ట్రిక్ పరికరాలు**

**ఒకే సాకెట్ నుంచి రెండు మూడు ఏసీలకు కనెక్షన్లు**

**ఓవర్ లోడు కారణంగా తలెత్తుతున్న షార్ట్ సర్క్యూట్‌లు**

**మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో..**

**గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లి నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు**



నిర్దేశిత లోడు కంటే ఎక్కువ కరెంట్‌ను వినియోగించడం.. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంతర్గత కేబుళ్లను ఇప్పటికీ మార్చక పోవడం.. కేబుల్ సామర్థ్యానికి మించి ఎలక్ట్రికల్ పరికరాలు వాడటం.. వైర్ల మధ్య జాయింట్లు ఎక్కువగా ఉండటం.. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తలెత్తుతుండటం.. ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, గీజర్లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, ఒవెన్‌లు, ఐరన్ బాక్సులు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు, లైట్లు రోజంతా ఆన్‌లోనే ఉంచడం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు సంభవించడానికి ఇవే కారణాలు. వీటివల్లనే కేబుళ్లు హీటెక్కి, మీటర్, జాయింట్ల వద్ద నిప్పు రవ్వలు (స్పార్క్‌లు) చెలరేగుతున్నాయి. ఇలా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల ఫలితంగా మాల్స్, దుకాణాలు, ఇళ్లలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దయెత్తున ఆస్తి నష్టం జరుగుతోంది. కొన్ని ఘటనల్లో అగ్నికీలల్లో చిక్కు కోవడం, పొగతో ఊపిరాడకపోవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. హైదరాబాద్‌లో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు లైన్లు, వైర్లు, ప్లగ్ లు, ఎంసీబీలు, ఎర్త్‌రాడ్‌ల పని తీరును పరిశీలించి, దెబ్బతిన్న కేబుళ్లను గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి అమర్చుకోవాల్సి ఉన్నా వాణిజ్య, గృహ వినియోగదా రులు పట్టించుకోవడం లేదు. పాతబస్తీలోని పురాతన భవనాల్లోనే కాకుండా, కొత్తగా సీఈఐజీ అనుమతి పొందిన హైరైజ్ భవనాల్లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### పాతబస్తీ అయినా.. కొత్త హైరైజ్‌లైనా

పాతబస్తీలో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లోనే కాదు గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్, నార్సింగి, మణికొండ, నానక్‌రాంగూడల్లో కొత్తగా నిర్మించే హైరైజ్ బిల్డింగ్స్‌లోనూ విద్యుత్ లైన్లు సరిగా ఉండటం లేదు. భవిష్యత్తు అవసరాల మేరకు లోడు ఎంపిక మొదలు..లైన్ల ఏర్పాటు వరకు అన్నీ లోపభూయిష్టంగానే ఉంటున్నాయి. భవన నిర్మాణ సమయంలో ఉన్న ఆలోచనకు, అవసరాలకు భిన్నంగా ఆ తర్వాత ఇంట్లోకి అనేక విద్యుత్ పరికరాలు వచ్చి చేరుతున్నాయి. వాణిజ్య భవనాల్లో తక్కువ సామర్థ్యంతో లైన్లు, కేబుళ్లు వేయడం జరుగుతోంది. నిర్మాణ ఖర్చులు తగ్గించుకునే క్రమంలో కనీస అనుభవం, అర్హత లేని ప్రైవేటు విద్యుత్ కాంట్రాక్టర్లతో విద్యుత్ పనులు చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎంసీబీలు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్ బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. సరైన ఎర్తింగ్ ఉండటం లేదు. మరోవైపు ఒకే ప్లగ్/వైరు నుంచి మల్టిపుల్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఒకే సాకెట్ నుంచి ఒకటికి మించిన ఏసీ కనెక్షన్లు ఉంటున్నాయి. ఇలా సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు విద్యుత్ ఎక్కువగా వినియోగించడం వల్ల బలహీనంగా ఉన్న కేబుళ్లు తట్టుకోలేకపోతున్నాయి. కేబుళ్ల జాయింట్ల వద్ద స్పార్క్‌లు చెలరేగుతున్నాయి.

### పేలుతున్న ఏసీ కంప్రెషర్లు

ఒకప్పుడు ధనవంతుల ఇళ్లల్లో మాత్రమే కన్పించే ఏసీలు, కూలర్లు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు.. ప్రస్తుతం సాధారణ మధ్య తరగతి ప్రజల ఇళ్లలోనూ దర్శనమిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి ఇందుకు దోహదపడుతోంది. ప్రతిఒక్కరూ సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు తగినట్టుగా తయారీ కంపెనీలతో పాటు పలు బ్యాంకులు జీరో వడ్డీ రుణాలు ఇస్తున్నాయి. వాయిదా పద్ధతుల్లో చెల్లించే అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు కూడా విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని చాలాచోట్ల 60 నుంచి 100 గజాల స్థలంలోనూ ఐదారు అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తున్నారు. కొందరు కింద షాపులను ఏర్పాటు చేసి, పైన నివాసానికి వీలుగా చిన్న చిన్న గదులను నిర్మిస్తున్నారు. నివాసితులు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ఏసీలూ వినియోగిస్తున్నారు. ఒక ఇంట్లోనే రెండు, మూడు ఏసీలు ఉంటున్నాయి. అయితే ఇరుకు గదుల్లో గాలి, వెలుతురు కూడా సరిగా ఉండటం లేదు. వైరింగ్ సరిగా లేకపోవడం, సామర్థ్యానికి మించి కరెంటు వాడటం, మండే ఎండల్లో రోజంతా ఏసీలు ఆన్‌లో ఉంటుండటం వల్ల కంప్రెషర్లు పేలిపోతున్నాయి.

### బయటకు రాలేక, మంటల్లో చిక్కుకుని..

కిటికీ, డోర్ కర్టెన్లు, పరుపులు, దుస్తువులకు నిప్పు అంటుకుని వేగంగా మంటలు వ్యాపిస్తున్నాయి. ఆ సమయంలో బయటికి వెళ్లేందుకు ఇరుకైన దారి ఉండటం, తలుపులకు తాళాలు వేసి ఉండటం, ఇతరత్రా కారణాలతో బయటకు వెళ్లలేక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల భవనం, తాజాగా చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన అగ్ని ప్రమాదాలకు ఇలాంటి పరిస్థితులే కారణమని స్పష్టమవుతోంది.

### ఇలా చేస్తే సేఫ్...

బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే భవనాల్లో ఉపయోగించాలి. విద్యుత్ మరమ్మతులు క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి. అతుకుల తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరం. విద్యుత్ ద్వారా నడిచే రిఫ్రిజిరేటర్, ఓవెన్లను గాలి, వెలుతురు బాగా వచ్చే చోట ఉంచాలి. అధిక ఓల్టేజీ ఉన్న ఉపకరణాలకు ఎర్తింగ్ ఉన్న 3 పిన్ సాకెట్లను వాడాలి. ల్యాప్‌టాప్, మొబైల్ చార్జింగ్ బెడ్ దగ్గర పెట్టకూడదు. విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే నీళ్లతో ఆర్పవద్దు. దీని వల్ల కరెంట్ షాక్ తగిలి ప్రాణాపాయం కలగొచ్చు. వెంటనే విద్యుత్‌ను ఆఫ్‌చేసి, పొడి ఇసుకతో లేదా కార్బన్ డయాక్సైడ్ ఎక్స్టింగ్విషర్‌తో మంటలను ఆర్పాలి.